
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
పల్నాడు
జిల్లా వార్తలు
5
బుధవారం 17 జూలై 2024



బదిలీలు



ఉన్నట్టా.. లేనట్టా..

- అయోమయంలో ప్రభుత్వ యంత్రాంగం
- కుంటుపడుతున్న పాలన
- పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలు
- మాకెందుకులే అన్న రీతిలో అధికారుల తీరు
- కోరుకున్న చోటకు బదిలీ కోసం అధికారుల యత్నం
- భారీగా లేఖలు జారీ చేసిన ప్రజా ప్రతినిధులు

అధికారులందరినీ బదిలీ చేస్తారనే ప్రచారం ఉద్యోగ వర్గాల్లో ఉంది. ఇదే అభిప్రాయాన్ని కొత్త ప్రభుత్వం వ్యక్తం చేస్తూ వస్తోంది. దీంతో పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి అధికారులు ఆసక్తి చూపడం లేదు. ఉంటామో వెళతామో అనే అంశంపై స్పష్టత రాకపోవడంతో, చాలా ఫైళ్ల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో పెండింగ్ సమస్యల విషయంలో పాత ప్రభుత్వంలో ఎదురైన అనుభవమే అక్కడక్కడా ప్రజలకు ఎదురవుతోంది. దీంతో జిల్లా అధికారుల బదిలీలపై ప్రభుత్వం త్వరిత గతిన నిర్ణయం తీసుకుంటే పాలన పూర్తి స్థాయిలో గాడిన పడే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ కార్యాలయాల్లో బదిలీలపైనే చర్చ సాగుతోంది. బదిలీలు ఉంటాయా.. ఉండవా అన్న సందేహాలు ప్రభుత్వ యంత్రాంగంలో నెలకొంది. కూటమి ప్రభుత్వం బదిలీలపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో పాలన కుంటుపడుతోంది. ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కార్యాలయాల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉంటామో బదిలీపై వెళతామో మాకెందుకులే అన్న రీతిలో ప్రజల సమస్యల పట్ల అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడే పరిస్థితి ఉంది. చేపట్టిన ప్రగతి పనులను అధికారులు ముందుకు తీసుకు పోవడంలేదు. కోరుకున్న చోటకు బదిలీ కోసం అధికార యంత్రాంగం ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. ఇప్పటికే బదిలీల కోసం ప్రజా ప్రతినిధులకు అధికారులు లేఖలు అందచేశారు. సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో కూడా బదిలీలపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో బదిలీల ప్రక్రియ తీవ్ర జాప్యం జరుగుతుందన్న వాదన అధికార యంత్రాంగం నుంచి వినిపిస్తోంది.

పంచాయతీ కార్యదర్శి నుంచి ఎంపీడీవో.. కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ.. వీఆర్వో నుంచి ఆర్డీవో వరకు బదిలీల ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇదే పరిస్థితి జిల్లా స్థాయి అధికారుల్లో కూడా నెలకొంది. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో బదిలీలు ఉంటాయన్న సమాచారంతో అధికారులు వారి విధులు పూర్తి స్థాయిలో నిర్వహించకుండా మిన్నకుంటున్నారన్న విమర్శలున్నాయి. కోరుకున్న చోటకు బదిలీ అయ్యేలా ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. ఇందుకోసం ప్రజా ప్రతినిధుల ఇళ్లకు క్యూ కడుతున్నారు. బదిలీలకు ఎమ్మెల్యేల లేఖ తప్పని సరి అన్న ప్రచారం జరుగుతోంది. దీంతో వారి లేఖలు పొందేందుకు అధికారులు లాబీయింగ్ చేసుకుంటున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున కొందరు ఎమ్మెల్యేలు బదిలీల సిఫార్సు లేఖలు జారీ చేశారు. వైసీపీతో అంటకాగిన అధికారులు విధుల్లో ఉండటంతో ప్రజా ప్రతినిధులు సిఫార్సు చేస్తున్న పనులు జరగకపోతుండటంతో వారు కూడా తీవ్ర అసంతృప్తి చేస్తున్నారు. మునిసిపాలిటీలలో పరిస్థితి దారుణంగా ఉంది. మురుగు నీటి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతున్నారు. రెవెన్యూ శాఖలో రైతుల భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఎన్నికల ముందు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తహసీల్దార్‌లను పూర్తిగా బదిలీ చేశారు. తిరిగి ఆదే స్థాయిలో తహసీల్దార్‌ల బదిలీలు జరిగే అవకాశం ఉంది. దీంతో రెవెన్యూ శాఖలో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. దీంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సదరు అధికారులు దృష్టి సారించడం లేదు. ఇక ఇంజనీర్లు అయితే ప్రగతి పనుల విషయంలో మిన్నకుంటున్నారు. ఇదే పరిస్థితి అన్ని శాఖల్లో నెలకొంది. పోలీసు శాఖలో కూడా బదిలీలు భారీగానే ఉంటాయన్న ప్రచారం నేపథ్యంలో సదరు అధికారులు శాంతి భద్రతల విషయంలో పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వైసీపీతో అంటకాగిన వారు పోలీసు శాఖలో ఎక్కువగానే ఉన్నారు. వీరందరిని బదిలీ చేయాలని కూటమి శ్రేణులు ఎమ్మెల్యేలపై వత్తిడి తెస్తున్నాయి. మొత్తం మీద బదిలీల ప్రక్రియపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు ప్రజల సమస్యలు పరిష్కారం కావనే చెప్పాలి. బదిలీలపై ప్రభుత్వ స్పష్టత కోసం ప్రజా ప్రతినిధులు.. అధికార యంత్రాంగం బాధిత ప్రజలు ఎదురు చూస్తున్నారు. బదిలీలపై త్వరతగతిన ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్న అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

- వైసీపీ నేతల చేతిలోనే యంత్ర పరికరాలు
- గ్రూపుల ఎంపికలో గతంలో ఇష్టారాజ్యం
- క్షేత్రస్థాయిలో యూనిట్ల పరిస్థితిపై ఆరా
- నివేదిక రూపకల్పనలో నిమగ్నమయిన యంత్రాంగం

రాయితీ ఎవరికిచ్చారు!

రాయితీ యంత్రాలను రైతులకు అందించే విషయంలో దాదాపు మూడేళ్ల పాటు మాటలతోనే సరిపెట్టిన వైసీపీ ప్రభుత్వం చివరి రెండేళ్లు మాత్రం హడావిడి చేసింది. రైతులకు వ్యక్తిగతంగా సాగు పనిముట్లు అందించే అంతకు ముందు ప్రభుత్వ విధానాన్ని కాలదన్ని కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల పేరిట గ్రూపుల విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో కూడా అనేక పిల్లిమొగ్గలు వేసిన అనంతరం ఆచరణలోకి తెచ్చింది. ఇక్కడా రాజకీయమే ప్రధానంగా నడుపుతూ అర్హులైన రైతుల నోట్లో మట్టి కొట్టి వైసీపీ నేతాగణం అనుచరులకే లబ్ధి చేకూర్చే విధంగా గ్రూపులను ఎంపిక చేసి రాయితీ యంత్రాల ఉద్దేశ్యాన్నే నీరుగార్చిందనే విమర్శలు ఉన్నాయి. మంజూరు చేసిన యూనిట్లలో దాదాపు 50 శాతం గ్రూపులు అసలు రైతులే కారని వారంతా వేర్వేరు రంగాల్లో స్థిర పడినప్పటికీ వైసీపీ నేతల సిఫారసుతో లబ్ధి పొందారనే ఆరోపణను గతంలో టీడీపీ చేసింది. పలు గ్రామాల్లో రైతులు కూడా ఇదే అంశంపై ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ రాయితీ యంత్రాల యూనిట్ల బాగోతంలో జరిగిన అవకతవకలపై కదలిక వచ్చింది. ఎన్ని గ్రూపులకు పరికరాలు ఇచ్చారు, ప్రస్తుతం ఆ పరికరాలు నిబంధనల ప్రకారం రైతుసేవా కేంద్రాలలోనే ఉన్నాయా అనే అంశంతోపాటు లబ్ధిదారుల జాబితాను కూడా పంపాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ నుంచి మౌఖిక ఆదేశాలు ఇప్పటికే జిల్లా అధికారులకు అందాయి.


బాపట్ల, జూలై16(ఆంధ్రజ్యోతి): 2014--19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతులకు కావాల్సిన సాగు పనిముట్లను రాయితీపై వ్యక్తిగతంగా అందించేది. అందుకు సంబంధించిన విధివిధానాలపై కూడా పూర్తి స్థాయిలో స్పష్టత ఉండడంతో రైతులకు పెద్ద ఎత్తున మేలు జరిగేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి మూడేళ్లు పూర్తిగా రాయితీ యంత్ర పరికరాలు అందించే విధానానికి స్వస్తి పలికింది. చివరి రెండేళ్లలో మాత్రం కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ)ల పేరిట రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి రాయితీ పరికరాలను అందించి వాటిని రైతుసేవా కేంద్రాలు (అప్పట్లో రైతుభరోసా)లో ఉంచి నామమాత్రపు అద్దె ప్రాతిపదికన రైతులకు అందించాలని నిర్ణయించింది. ప్రకటన అయితే ఇచ్చింది తప్ప మార్గదర్శకాల విషయంలో పలుమార్లు పిల్లిమొగ్గలను వైసీపీ ప్రభుత్వం వేసింది. రైతులకు అత్యంత అవసరమైన ట్రాక్టరును రాయితీ నుంచి మినహాయించడంతో అవాక్కవడం రైతుల వంతయింది. తర్వాత దానిని చేర్చింది. దీంతో పాటు యంత్రాలు అందించే కంపెనీల వారికి బిల్లులు పెండింగ్ పెట్టడంతో యంత్రాల సరఫరాకు వారు సైతం ఆసక్తి చూపలేదు. ఇలా అనేక బాలారిష్టాలను దాటి ఇచ్చిన అరకొర యూనిట్లు సైతం వైసీపీ వారికి ఇచ్చి మమ అనిపించిన ఘనత వైసీపీది.

దేనిపైనా స్పష్టత లేకుండా..

రాయితీ యంత్రాలను రైతులకు అందించే విషయంలో దేనిపైనా స్పష్టత లేకుండా వైసీపీ ప్రభుత్వం వ్యవహరించడంతో ఐదేళ్ల పాటు అన్నదాతలు ఎన్నో అగచాట్లు పడ్డారు. ఆయా గ్రూపుల ద్వారా రాయితీ యంత్రాలు పొందిన వారు వాటిని రైతు సేవా కేంద్రాలలో ఉంచితే అక్కడ నుంచి అద్దె ప్రాతిపదికన కావాల్సిన రైతులు తీసుకెళతారని ప్రభుత్వం చెప్పింది. కానీ అద్దెఎంత, పర్యవేక్షించేదెవరు అనే అంశంలో అంతా గందరగోళమే తప్ప స్పష్టత కొరవడింది.

వైసీపీ నేతల ఇళ్ల వద్దే...

ఆదేశాలలో మాత్రమే పరికరాలను రైతు సేవా కేంద్రాలలో ఉంచాలని చెప్పేవారు. కానీ ఆచరణలో మాత్రం ఆ పరికరాలన్నీ కూడా వైసీపీ నేతల ఇళ్ల వద్దే ఉండేవి. హక్కుగా వాటి ప్రయోజనాలను పొందాల్సిన రైతులు అలా కాకుండా వైసీపీ నేతల ఇళ్ల ముందు పడిగాపులు పడే విధంగా చేశారు. ఇక అద్దె విషయంలో కూడా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా అడిగే వారే కరువయ్యారు. పక్షపాత ధోరణితో ఈ వ్యవహారం నడిచేది. వైసీపీతో అంటకాగితే ఒకలా, లేకుంటే మరోలా ఈ అద్దె ఉండేది. టీడీపీ సానుభూతి పరులుగా ముద్ర ఉన్న రైతుల విషయంలో అయితే ఈ అద్దెను అమాంతం రెండు మూడు రెట్లు పెంచి నిలువునా దోచేశారు. దేనికీ లెక్కాపత్రం ఉండేదికాదు, పర్యవేక్షించే వ్యవస్థలు కూడా లేకపోవడంతో రాయితీ యంత్రాలు కాస్తా రాజకీయ యంత్రాలుగా మార్చి ఇష్టారీతిన వైసీపీ నేతలు దోచేశారు



సమగ్ర విచారణ దిశగా...

రాయితీ యంత్రాల విషయంలో సమగ్ర విచారణ చేసే దిశగా యంత్రాంగం అడుగులేస్తోంది. ముందుగా జిల్లాల్లో జారీ చేసిన యూనిట్లలో సభ్యులుగా ఉన్నవారెవరు అనే అంశంపై పూర్తి స్థాయిలో దృష్టిసారించారు. వీరంతా అసలు రైతులా.. కాదా అనే దానిపైనే తొలుత విచారణ జరగనుంది. గ్రూపు సభ్యులు అందుకున్న పరికరాలు ఇళ్ల వద్ద కాకుండా రైతు సేవా కేంద్రాలలో ఉంచాలనేది నిబంధన. అలా కాకుండా సొంత ఆస్తిలాగా ఇన్నిరోజులూ ఇళ్ల వద్దనే ఉంచుకుని రైతులను ఇక్కట్లకు గురిచేశారు. ప్రభుత్వం వైపు నుంచి విచారణ చేసే దిశగా కదలిక రావడంతో పరికరాలను ఆయా కేంద్రాల వద్ద ఉంచి వెళుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పరికరాలు సభ్యులకు అందిన దగ్గర నుంచి నామమాత్రపు అద్దె ప్రాతిపదికన ఎంతమందికి ఇచ్చారు, ఎంతమంది రైతులకు లబ్ధి చేకూర్చారు అనే వాటిపై కూడా పూర్తి విచారణ చేసి నివేదిక సమర్పించే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు

కొన్ని యంత్రాలు అసలు లేవని...

ఒక్కో గ్రూపునకు 5 నుంచి 15 లక్షల విలువైన యంత్రపరికరాలను అందించారు. యంత్రాల కోసం గ్రూపులకు అందించే రుణాలలో 50 శాతం బ్యాంకు రుణం కాగా, 40 శాతం వాటాను ప్రభుత్వం సబ్సిడీ రూపంలోనూ, మిగిలినది ఆయా గ్రూపు సభ్యులే భరించాల్సి ఉంటుంది. వీటిని గ్రామంలోని రైతుల అవసరాల కోసం అద్దె ప్రాతిపదికన అందించాలే కానీ ఇతరత్రా చేయకూడదు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లిన అధికారులకు విస్తుపోయే అంశాలు అనుభవంలోకి వస్తున్నాయి. ఆయా గ్రూపు సభ్యుల జాడ కనిపించడంలేదు. దీంతో ఏదో మొక్కుబడిగా పేర్లు చేర్చి ఆ సబ్సిడీని వైసీపీ నేతలే కొట్టేశారా అనే అనుమానం కూడా కలుగుతోంది. ఇక పరికరాలు కూడా అన్నీ కనిపించడం లేదని, దాదాపు ప్రతి గ్రూపులో ఒకట్రెండు యంత్రాలు మిస్సింగ్ కనబడుతున్నాయని వాటినేమన్నా బయటి వ్యక్తులకు అమ్మారా అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అర్హులు కాకుండా లబ్ధి పొందిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ముందుకెళతామని యంత్రాంగం చెబుతోంది.

సగం యూనిట్లు వైసీపీ వారి చేతిలోనే..

బాపట్ల జిల్లాలో మొత్తం 410 రైతు సేవా కేంద్రాలుఉండగా రాయితీ యంత్రాలను దఫాల వారీగా అందించింది 270 కేంద్రాలలో మాత్రమే. ఇందులో కూడా అన్నదాతలకు అవసరమైన ట్రాక్టరును మినహాయించి ఇచ్చిన యూనిట్లే ఎక్కువ. 270 యూనిట్లలో దాదాపు 120కు పైగా వైసీపీ నేతల అనుచరుల చేతిలోనే ఉన్నట్లు సమాచారం. అదే విధంగా గుంటూరు జిల్లాలో మొత్తం 249 కేంద్రాలుండగా దాదాపు 205 కేంద్రాల్లో యూనిట్లు ఉంచినట్లు గతంలో వ్యవసాయశాఖ తెలిపింది. ఇందులో 50 శాతం వైసీపీకి కొమ్ముకాసిన వారే లబ్ధిదారులుగా ఉన్నారు. పల్నాడు జిల్లాలో 421 రైతు సేవా కేంద్రాలు ఉండగా 290 సెంటర్లలో రాయితీ యంత్రాలు ఉంచారు. ఇక్కడ కూడా చాలా చోట్ల ట్రాక్టరు లేకుండానే మమ అనిపించగా సగం కేంద్రాలలో అసలు రైతులే లబ్ధిదారులుగా లేరని తెలుస్తోంది.



● మున్సిపల్ రిజర్వాయర్



బైపాస్ పనుల నిమిత్తం తొలగించిన పైపులైన్లు

తాగునీటి గండం

గత పాలకుల నిర్లక్ష్యం.. పురపాలక సంఘం అధికారుల అలసత్వం వెరసి మాచర్ల పట్టణానికి తాగునీటి ముప్పు పొంచి ఉంది.. మున్సిపల్ రిజర్వాయర్‌లో నీరు అడుగంటుతోంది.. దీనికి తోడు బైపాస్ పనుల్లో భాగంగా పైపులైన్లు తొలగించడంతో కుడి కాలువ నీరు రిజర్వాయర్‌కు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.. ఫిల్టర్ బెడ్లు సైతం మరమ్మతులకు గురవడంతో పూర్తిస్థాయిలో పట్టణానికి నీటిని అందించలేని దుస్థితి నెలకొంది..

- అడుగంటుతున్న మాచర్ల మున్సిపల్ రిజర్వాయర్
- రెండు నెలలకు సరిపడా మాత్రమే నీరు
- బైపాస్ పనుల కోసం పైపులైన్లు తొలగింపు
- మరమ్మతులకు గురైన ఫిల్టర్ బెడ్లు

మాచర్లటౌన్, జూలై 16: మాచర్ల పట్టణంలోని మున్సిపల్ రిజర్వాయర్ నుంచి నీటిని పట్టణ వాసులకు అందిస్తుంటారు. ప్రతి వేసవిలో తాగునీటి నిమిత్తం కుడి కాలువ నీటితో మున్సిపల్ రిజర్వాయర్ నింపుతారు. ఈ నీటితో పట్టణ ప్రజల దాహార్తి తీరుతుంది. అయితే ప్రస్తుతం రిజర్వాయర్‌లో రెండు నెలల కు సరిపడా నీరు మాత్రమే ఉంది. కుడి కాలు వ ద్వారా నీటిని నింపే పరిస్థితి ఇప్పుడు లేదు. బైపాస్ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా కుడి కాలువ నుంచి మున్సిపల్ రిజర్వాయర్‌కు నీటిని అందించే పైపులైన్లను తొలగించారు. కృష్ణా రివర్ బోర్డు ఆదేశాల మేరకు బుధవారం నుంచి కుడి కాలువ ద్వారా తాగునీటిని నాలుగు రోజుల పాటు అందించనున్నారు. అయితే పైపులైన్లు తొలగింపుతో ఆ నీరు రిజర్వాయర్‌కు చేరే పరిస్థితి లేదు.

ఫిల్టర్‌బెడ్లు మరమ్మతులతో...

మున్సిపల్ రిజర్వాయర్‌లోని నీటిని ఫిల్టర్ బెడ్ల ద్వారా శుద్ధి చేసి సుమారు లక్ష జనాభా ఉన్న మాచర్ల పట్టణానికి తాగునీటిని అందిస్తారు. రోజుకు 30 లక్షల లీటర్ల నీటిని అందించే వారు. ఈ నీటిని రోజు మార్చి రోజు సరఫరా చేసే వారు. అయితే ఫిల్టర్ బెడ్లు మరమ్మతులకు గురై 20 రోజులు కావోస్తోంది. దీంతో రోజుకు కేవలం 10 లక్షల లీటర్ల నీరు శుద్ధి చేసి అందించడం కష్టంగా మారింది. ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతులపై పాలకులు, అధికారులు 20 రోజులు గడుస్తున్నా దృష్టి సారించలేదు.

పాలకుల నిర్లక్ష్యంతో..

పురపాలక సంఘంలోని ఫిల్టర్‌బెడ్‌లను మూడేళ్లకోసారి శుభ్రం చేసుకోవాల్సి ఉంది. అయితే వైసీపీ హయాంలో ఆ దిశగా పాలకులు అడుగులు వేయలేదు. టీడీపీ హయాంలో మాత్రమే ఫిల్టర్ బెడ్లు మరమ్మతులు చేశారు. వైసీపీ పాలకులు ఫిల్టర్‌బెడ్‌లను పట్టించుకోకపోవడంతో అవి మొరాయించాయి. దీంతో పట్టణ ప్రజలకు శుద్ధ జలం అందించడం కష్టతరమవుతోంది. పది రోజులకోసారి పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నీరు సరిపడక ఆందోళన చేస్తున్న వార్డు ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటి ని సరఫరా చేస్తున్నారు. ట్యాంకరు వచ్చినప్పుడు నీరు పట్టుకునేందుకు ప్రజలు యుద్ధమే చేయాల్సి వస్తోంది. ట్యాంకరు నీరు సరిపోక పోవడంతో తామంటే తాము ముందు నీటిని పట్టుకోవాలని ఎగబడుతున్నారు. నీటి సమస్య ఇలాగే కొనసాగితే మున్ముందు పట్టణంలో నీటి సమస్య మరింత జఠిలమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



ట్యాంకర్ వద్ద నీటి కోసం ఎగబడుతున్న ప్రజలు

టెక్నీషియన్స్‌ను పిలిపిస్తున్నాం..



ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులకు తిరుపతి నుంచి టెక్నీషియన్స్‌ను పిలిపిస్తున్నాం. త్వరలోనే మరమ్మతులు నిర్వహిస్తాం. బైపాసు పనుల నిమిత్తం కుడి కాలువ ద్వారా మున్సిపల్ రిజర్వాయర్‌కు నీటిని అందించే పైపులైన్లు తొలగించారు. అధికారులతో మాట్లాడి బైపాసు పనులు త్వరగా పూర్తయి పైపులైన్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

- మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు

నేడు సాగర్ కుడి కాలువకు తాగునీటి విడుదల



సాగర్ కుడి కాలువ

మాచర్ల రూరల్, జూలై 16: నాగార్జున సాగర్ కుడి కాలువకు బుధవారం తాగునీటిని విడుదల చేయనున్నట్లు మాచర్ల ఓఅండ్ఎం ఈఈ శ్రీహరి మంగళవారం తెలిపారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఈ నీటి విడుదల కొనసాగుతుందన్నారు. మొత్తం 4.5 టీఎం సీల నీటిని రోజుకు 5500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేయనున్నట్లు చెప్పారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు పర్యవేక్షణలో నీటి విడుదల జరుగుతుందన్నారు.

రేషన్ షాపులను తనిఖీ చేయాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్లు చౌక ధరల దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సమీక్షలో అయన మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను సుమోటో వెరిఫికేషన్ తహసీల్దార్లు 18 కల్లా పూర్తి చేయాలి. చిరునామాలు, ఫోన్ నెంబర్లు అందుబాటులో లేని దరఖాస్తుదారుల కుల ధ్రువీకరణ ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల జాబితా ఆధారంగా పరిశీలన పూర్తి చేయాలన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులపై నిబంధనల ప్రకారం పరిష్కారాలు చూపాలి. ఇసుక తవ్వకాల కోసం అవసరమైన పర్యావరణ అనుమతులు వెంటనే పొందేలా మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలి. జిల్లాలో ఇసుక కొరత రాకుండా చూడాలి. జిల్లా వ్యాప్తంగా పారిశుద్ధ్యం మెరుగుపడాలి. పట్టణాలలో పారిశుద్ధ్య పనులను మునిసిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని సూచించారు. పంచాయతీల్లో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డేని గురు, శుక్రవారాల్లో రెండు రోజులూ నిర్వహించాలి. ఎంపీడీవోలు మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీలు చేయాలని ఆదేశించారు. ప్రతి ఎంపీడీవో వారానికి కనీసం ఒక పాఠశాల, ఒక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలి. వచ్చే నెల ఒకటో తేదీన ప్రతి గ్రామంలో ఉదయం 5 గంటలకే తొలి పింఛన్ పంపిణీ జరగాలి. మొదటి రోజే వందశాతం పింఛన్ల పంపిణీ చేయాలన్నారు. మండల స్థాయిలో బియ్యం, కందిపప్పు పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సాగర్ నుంచి సరఫరా చేస్తున్న నీటిని కేవలం తాగునీటికి మాత్రమే వాడేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఖరీఫ్ సాగుకోసం సాగర్ నీటి లభ్యత, ఇప్పటివరకూ నమోదైన వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ ప్రణాళిక అమలు చేయాలి. కంది సాగు చేయనున్న రైతులకు అవసరమైన సహాయం అందించాలి. అధికారులంతా ఈ ఆఫీసు ఉపయోగించాలి. మండల ప్రత్యేక ఆఫీసర్లు ప్రతి శుక్రవారం క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టాలి. సమావేశంలో అధికారులంతా బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశిస్తూ తక్షణ ప్రాధాన్యత కలిగిన పలు అంశాలు, శాఖల వారీగా లక్ష్యాలు నిర్దేశించారు.

దిక్సూచి

గుంటూరు-లాంలోని ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ ఏయూ)- 'అగ్రిసెట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని వ్యవసాయ విభాగాల్లో పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులకు ఉద్దేశించారు. ఈ ఎగ్జామ్‌లో సాధించిన స్కోర్ ద్వారా నాలుగేళ్ల వ్యవధి గల 'బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎన్.జీ.రంగా వర్సిటీ అగ్రిసెట్



విభాగాలు: అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ ఫార్మింగ్

అర్హత: ఏఎన్‌జీఆర్‌ఏయూ/పీజేటీఎస్‌ఏయూ నుంచి రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 22 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.

అగ్రిసెట్ వివరాలు: అభ్యర్థులు తమ డిప్లొమా స్ట్రీమ్‌లోనే అగ్రిసెట్ ఎగ్జామ్ రాయాలి. ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) ప్రోగ్రామ్‌లకు ఏఎన్‌జీఆర్‌ఏయూ నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్న పత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఈ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 25 శాతం(30)మార్కులు రావాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **ఏఎన్‌జీఆర్‌ఏయూ అగ్రిసెట్ తేదీ:** ఆగస్టు 27 ● **వెబ్‌సైట్:** angrau.ac.in

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the post-graduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000

Last Date to Apply: 04-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/HDFC54

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/AT8a4gNలో చదవండి.

SCHOLARSHIP ALERT

Panasonic Ratti Chhatr Scholarship

Description: Panasonic Life Solutions India (PLSIND) invites applications from students enrolling in B.E./B.Tech. courses at the Indian Institutes of Technology (IITs).

Eligibility: Open for students across India who have cleared the entrance for admission into B.E./B.Tech. courses at any of the IITs (Indian Institute of Technology) in 2024-25. Applicants must have cleared their Class 12 examination or be awaiting final results. Applicants must have scored more than 75% marks in Class 12. The annual family income of the applicant must not be more than INR 8,00,000 from all sources. Only candidates from 2024-25 batch are eligible to apply.

Prizes & Rewards: Scholarship amount: INR 70,250 per year for four years

Last Date: 15-08-2024 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/RCSP56

buddy4study.com

పోటీ పరీక్షల దిక్సూచి

కొత్త పుస్తకం

భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ

మరి కొద్ది నెలల్లో తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలు నిర్వహించబోతున్నారు. అటు ఏపీలోనూ ఇటీవల కొలువు తీరిన కొత్త ప్రభుత్వం భారీ స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి సమాయత్తం అవుతోంది. పోటీ పరీక్షలు ఏవైనా...ఇండియన్ పాలిటీ ప్రాధాన్యం ఎనలేనిది. పైగా అన్ని సబ్జెక్టుల్లో కన్నా ఎక్కువ మార్కులు తెచ్చిపెట్టే సబ్జెక్టు కూడా ఇదే. ఈ నేపథ్యంలో పోటీ పరీక్షల శిక్షణలో చాలా అనుభవం ఉన్న డాక్టర్ సుంకర రమాదేవీ రచించిన 'భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ' 15వ ఎడిషన్ మార్కెట్‌లోకి విడుదల అయ్యింది. దాదాపు 333 పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను అధ్యయనం చేసి ఈ పుస్తకానికి రూపకల్పన చేశారు. శాసన వ్యవస్థల కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ, రాజ్యాంగ, రాజ్యాంగేతర సంస్థల్లో వచ్చిన అన్ని పరిణామాలను, చట్టాలను, కోర్టుల తీర్పులను ఈ పుస్తకంలో పొందుపరిచారు. రాజ్యాంగ నిర్మాణ వివరాలతోపాటు ఉద్యమ చరిత్ర, రాజ్యాంగ చరిత్రలో ముఖ్య ఘట్టాలు, రాజ్యాంగం ఏర్పడటానికి దారితీసిన చారిత్రక పోరాటాలు - పరిణామాలు, బ్రిటిష్ పాలకులు అనుసరించిన వ్యూహాలు తదితర వివరాలన్నీ ఈ పుస్తకంలో ఉన్నాయి. భారత రాజకీయ వ్యవస్థకు సంబంధించిన ప్రతి అంశాన్నీ సంపూర్ణంగా, వాద ప్రతివాదాల సమాచారంతో ఎంతో ప్రామాణికంగా రూపొందించారు. అదేవిధంగా ఇండియా వర్సెస్ భారత్, ఉమ్మడి పౌర స్మృతి- ఒకే దేశం ఒకే చట్టం, పౌరసత్వ సవరణ చట్టం- విమర్శ, ఆర్టికల్ 370 రద్దు- సుప్రీంకోర్టు తీర్పు, కొత్త పార్లమెంట్ భవనం- సెంగోల్ స్థాపన, జమిలీ ఎన్నికలు - రామ్‌నాథ్ కోవింద్ కమిటీ, కొత్త నేర న్యాయ చట్టాలు, సాధారణ ఎన్నికల ఫలితాలు- 2024పై విశ్లేషణ, ఎలక్టోరల్ బాండ్స్ వంటి సమకాలీన అంశాలను వివరంగా చర్చించారు. సమగ్రమైన రాజ్యాంగ విశ్లేషణను, భారత రాజకీయాలకు సంబంధించిన సమాచారాన్ని, చారిత్రక పరిణామాలను వివిధ పట్టికల రూపంలో చక్కగా అందించారు. ఈ పుస్తకం కేవలం ఏపీపీఎస్సీ, టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకే కాదు విద్యార్థులకు, అధ్యాపకులకు, న్యాయవాదులకు, స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే వారికి కరదీపిక వలె ఉపయోగపడుతుంది.



పుస్తకం పేరు: భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ (15వ ఎడిషన్)
పేజీలు: 1202(రెండు వాల్యూమ్స్ కలిపి)
వెల: రూ.899/- **ప్రతులకు:** శ్రీ తేజ పబ్లికేషన్స్, గాంధీనగర్, హైదరాబాద్-500080 **ఫోన్ నెం:** 8686430054, 8686430055

నవ్య | చిత్రజ్యోతి

బ్రహ్మారాక్షసుడిలా...



తమిళ కథానాయకుడు ధనుష్ 50వ చిత్రం 'రాయన్'. ఈ సినిమాకు ఆయనే దర్శకుడు కూడా. సందీప్‌కిషన్, కాళిదాస్ జయరామ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. 'బ్రహ్మారాక్షసుడిలా వస్తాడు.. దహనం చేస్తాడు' అంటూ ధనుష్ పాత్రను పరిచయం చేశారు. యాక్షన్ ప్యాక్డ్ ఎలిమెంట్స్‌తో ట్రైలర్ అదిరిపోయింది. ఇందులో నటించిన సందీప్‌కిషన్, ప్రకాశ్‌రాజ్, ఎస్.జె.సూర్య, కాళిదాస్ జయరామ్ ముఖ్య పాత్రలో కనిపించారు. ఆస్కార్ విన్నర్ ఏ.ఆర్.రెహమాన్ నేపథ్యం సంగీతం అలరించింది. పీటర్ హెయిన్ యాక్షన్ కొరియోగ్రఫీ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. ఈ నెల 26న 'రాయన్' చిత్రం విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను ఏషియన్ సురేశ్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ విడుదల చేయనుంది.

ఆ రోజులు మళ్లీ రాకూడదు



'గడచిన మూడేళ్ల ఎన్నో ఆటుపోట్లు చవిచూశాను. నా జీవితం తీవ్రమైన ఒడిదుడుకులతో గడిచింది. ఆ రోజులు నా జీవితంలో మళ్లీ రాకూడదు అని కోరుకుంటున్నాను' అని హీరోయిన్ సమంత అన్నారు. ఆమె ఇటీవలే ఓ మీడియా ఇంటర్వ్యూలో తన సినిమాలు, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. 'మన జీవితాల్లో కొన్ని సంఘటనలు చేదు అనుభవాలుగా మిగిలిపోతాయి. ఎంత ప్రయత్నించినా మనం వాటిని ఆపలేం. అలాంటప్పుడు వాటిని అంగీకరించి, అధిగమిస్తూ ముందుకెళ్లడమే మనం చేయాల్సింది. కష్టకాలంలో ఆధ్యాత్మికత నాకు స్ఫూర్తినిచ్చింది. వ్యక్తిగతంగా, కెరీర్ పరంగా నాలో మంచి మార్పులకు కారణమైంది. ఈతరం ఎక్కువగా మానసిక అనారోగ్యానికి గురవుతోంది. ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవడం వల్ల ప్రశాంతంగా ఉండొచ్చు. ప్రస్తుతం నా జీవితం బావుంది. నేను మునుపటికన్నా బావున్నాను' అని సమంత చెప్పారు. కొత్త సినిమాల గురించి మాట్లాడుతూ 'ఈ ప్రపంచంలో నాకు బాగా ఇష్టమైన విషయం కెమెరా ముందు నిల్చోవడమే. ఆగస్టు నుంచి కొత్త సినిమా షూటింగ్‌లో పాల్గొంటాను. నా పాత్ర కోసం తర్ఫీదు అవుతున్నాను. విలువిద్య, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నాను. నేను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది. అందుకే కొత్త నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం ఉన్న కథలనే ఎంపిక చేసుకుంటున్నాను' అని ఆమె చెప్పారు. సమంత స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'లో నటిస్తున్నారు. ఆమె నటించిన 'హనీ-బన్నీ' వెబ్‌సిరీస్ త్వరలో స్ట్రీమింగ్ అవనుంది.

ఇది సెలబ్రేట్ చేసుకోవాల్సిన విజయం



'నా సినీ జీవితంలో 200కు పైగా సినిమాలు చేశాను. అయితే వాటిలో అన్ని సినిమాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించి ఉండకపోవచ్చు. కానీ 'కల్కి 2898 ఏడీ' విజయాన్ని మాత్రం కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలి. సినిమా విడుదలైనప్పటి నుంచి నాకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి' అని నటుడు కమల్‌హాసన్ అన్నారు. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీసు దగ్గర సంచలన విజయాన్ని అందుకోవడంతో పాటు రూ. వెయ్యికోట్ల వసూళ్లను అధిగమించిన సందర్భంగా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన కమల్‌హాసన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ "కల్కి చిత్రానికి వసూళ్ల పరంగా వస్తున్న ఆదరణ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో యాస్కిన్ పాత్ర కోసం చాలా కసరత్తు జరిగింది. చాలా కష్టపడ్డాం. మేకప్ కోసం లాస్ ఏంజెల్స్ వెళ్లాం. మొదట్లో నా గెటప్ చూసి నాకే ఎబ్బెట్టుగా అనిపించినా, క్రమంగా ఉత్సాహం కలిగింది. రెండో భాగంలో నా పాత్ర నిడివి ఎక్కువగా ఉంటుంది. భారతీయ చిత్ర పరిశ్రమలోని దిగ్గజాలు అంతా ఈ చిత్రంలో కలసి నటించారు. ఒకప్పుడు సింగీతం శ్రీనివాసరావులా ఇప్పుడు నాగ్ అశ్విన్ కూడా ప్రేక్షకులను మాయ చేశారు. చిన్నపిల్లలు ఆటలో లీనమైపోయినట్లు పాత్రధారులందరూ తమ తమ పాత్రల్లో జీవించారు. సినిమా చూసిన ప్రేక్షకులు ఎంత సంతోషిస్తే మేము అంతగా సంతోషిస్తాం' అని పేర్కొన్నారు.

విలన్‌గా అభిషేక్ బచ్చన్



బాలీవుడ్‌లో ఒక్కో హీరో ఇప్పుడు విలన్‌గా మారుతున్నాడు. సంజయ్‌దత్, సైఫ్ అలీఖాన్, రణ్‌వీర్ సింగ్, బాబీ డియోల్... ఇలా . తాజాగా ఈ జాబితాలోకి అభిషేక్ బచ్చన్ చేరబోతున్నారు. షారుఖ్‌ఖాన్ కొత్త చిత్రం 'కింగ్'లో అభిషేక్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయన తండ్రి అమితాబ్ స్వయంగా వెల్లడించడం విశేషం. 'ఇదే సమయం' అంటూ తనయుడు అభిషేక్‌కు అభినందనలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు అమితాబ్. గత ఏడాది 'జవాన్', 'పఠాన్' చిత్రాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ ఇచ్చిన షారుఖ్ ఖాన్ ఇప్పుడు 'కింగ్' చిత్రం కోసం సిద్ధమవుతున్నారు. ఆయన కుమార్తె సుహానా ఈ సినిమాలో మరో కీలక పాత్ర పోషించనున్నారు. తండ్రీ కూతుళ్లు కలసి నటిస్తున్న తొలి చిత్రం ఇదే. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న 'కింగ్' చిత్రానికి సుజయ్ ఘోష్ దర్శకత్వం వహిస్తున్నారు.

మాస్‌ను ఆకట్టుకునేలా...



రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్'లో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమాలో హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్నారు. ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్ అందరికీ నచ్చడమే కాకుండా.. సినిమాపై అంచనాలను పెంచింది. మంగళవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'మార్ ముంతా చోడ్ చింత'ను మేకర్స్ విడుదల చేశారు. మాస్‌ను ఆకట్టుకునేలా ఈ సాంగ్‌లోని లిరిక్స్, డాన్స్ మూమెంట్స్ సాగాయి. ఈ పాటకు శ్యామ్ సాహిత్యం అందించగా రాహుల్ సిప్లిగంజ్, ధనుంజయ్ సీపాన, కీర్తన శర్మ ఆలపించారు. మణిశర్మ సంగీతం అందించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి

ముద్దు సీన్‌కు మూడు కట్స్



'యానిమల్' సినిమాలో బోల్డ్ సీన్స్‌లో పాల్గొని అందరి దృష్టినీ ఆకర్షించిన హాట్ గర్ల్ త్రిప్తి దిమ్రీ నటించిన తాజా చిత్రం 'బ్యాడ్ న్యూజ్'. విక్కీ కౌశల్ హీరోగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఈ నెల 19న విడుదల కానుంది. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో హీరోహీరోయిన్ల మధ్య ముద్దు సీన్లు మూడు ఉన్నాయట. ఈ మధ్యకాలంలో కిస్సింగ్ సీన్లను చూసీ చూడనట్లు వదిలేస్తున్న సెన్సార్ వారు 'బ్యాడ్ న్యూజ్' చిత్రం మీద కన్నెర్ర చేసి, కత్తెరకు పని చెప్పారట. విక్కీ, త్రిప్తి పై చిత్రీకరించిన ముద్దు సీన్లు మోతాదు మించి ఉన్నాయనీ, తగ్గించాలని సెన్సారు అధికారి చెప్పడంతో చేసేదేమీ లేక వాటిని తగ్గించి విడుదల చేస్తున్నారు. త్రిప్తి అభిమానులకు ఇది బ్యాడ్ న్యూసే కదూ!

పవర్‌ఫుల్ పాత్రలో



పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తి కథానాయకుడిగా రూపొందుతున్న తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'సర్దార్ 2'. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'సర్దార్' చిత్రానికి ఇది కొనసాగింపు. కొన్ని రోజుల క్రితమే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభమైంది. తాజాగా చిత్రబృందం అప్‌డేట్ ఇచ్చింది. నటుడు, దర్శకుడు ఎస్‌జే సూర్య ఈ చిత్రంలో పవర్‌ఫుల్ రోల్‌లో నటిస్తున్నట్లు మంగళవారం తెలిపింది. ఎస్. లక్ష్మణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి యువన్ శంకర్‌రాజా సంగీతం అందిస్తున్నారు.

ఆ రోజులు గుర్తొస్తున్నాయి



'ప్రతి సినిమాను ఎంతో ప్యాషన్‌తో తీసే నిర్మాత వేణుగోపాల్. ఆయనకు మంచి టేస్ట్ ఉంది. లవ్ స్టోరీస్ మీద పట్టుంది. ఈ సినిమా టీమ్‌ను, హీరోలను చూస్తుంటే నాకు 'ఈ నగరానికి ఏమైంది' రోజులు గుర్తుకు వస్తున్నాయి' అన్నారు హీరో విష్వక్‌సేన్. 'రోటీ కపడా రొమాన్స్' చిత్రంలోని 'గలీజ్' సాంగ్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సృజన్ కుమార్ బొజ్జం తో కలసి బెక్కం వేణుగోపాల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్ హీరోలుగా నటించిన ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ 'ఓ కొత్త పాయింట్‌ను ప్రేక్షకులకు చెప్పాలని ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ని నిర్మించాం. ఇటీవల కొంతమంది యూత్‌కి ఈ సినిమా చూపించాం. వారు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌తో మా కాన్ఫిడెన్స్ మరింత పెరిగింది' అన్నారు. ఆగస్టు 2న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మరో నిర్మాత సృజన్‌కుమార్ చెప్పారు.

ఆకట్టుకునే విజువల్స్‌తో... 'మా ఊరి జాతరలో'



అల్లరి నరేశ్, అమృత అయ్యర్ జంటగా నటిస్తున్న చిత్రం 'బచ్చల మల్లి'. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని రేకెత్తించాయి. మంగళవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'మా ఊరి జాతరలో' పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ ఫోక్ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ, విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. సింధూరి విశాల్, హరిగౌర ఆలపించగా, విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్ : చోటా కె ప్రసాద్, డీఓపీ : ఎం. రిచర్డ్ నాథన్.

రాజ్ తరుణ్‌కు నోటీసులు ?



సినిమా హీరో రాజ్ తరుణ్‌పై లావణ్య చేసిన ఫిర్యాదులో రాజ్ తరుణ్‌ను విచారించేందుకు నార్సింగ్ పోలీసులు సిద్ధమయ్యారు. రేపు విచారణకు హాజరు కావాలని రాజ్‌తరుణ్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆయన వాంగ్మూలాన్ని రికార్డ్ చేయడంతో పాటు పలు అంశాలపై ఆరా తీయనున్నారు. రాజ్ తరుణ్‌కు నోటీసులు ఇచ్చినట్లు మంగళవారం ప్రచారం జరిగింది. అయితే ఈ కేసులో నోటీసుల విషయంపై నార్సింగ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ కోసం సంప్రదించగా ఆయన స్పందించలేదు.

- నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

ముగ్గురు స్నేహితుల కథ



ముక్కా శ్రీను, సుచిత్ర రాథోడ్, దిల్ రమేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఎస్.ఐ.కోదండపాణి'. రెంటాల నాగేంద్ర దర్శకత్వంలో ముక్కా శ్రీదేవి నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ప్రీమియర్ షోను మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రెంటాల నాగేంద్ర మాట్లాడుతూ "కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా సినిమాను తెరకెక్కించాను. ముగ్గురు స్నేహితులు ఓ మర్డర్ మిస్టరీలో ఇరుక్కుని ఎలా బయటపడారనేది సినిమా కథ" అని అన్నారు. "కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా ఇది. అందరినీ తప్పకుండా ఆకట్టుకుంటుంది" అని నిర్మాత శ్రీదేవి అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఉదయ్, కెమెరామెన్: నబరి, సంగీతం: సాల్మన్.

సమాజానికి అవసరమైన ఇండియా ఫైల్స్



తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అద్దంకి దయాకర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇండియా ఫైల్స్'. ఇంద్రజ, సుమన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డాక్టర్ బొమ్మకు మురళి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ఆడియో వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రంలో నటిస్తున్న ప్రతీ ఒక్కరికీ నా అభినందనలు. ఈ మూవీ టీమ్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. ప్రస్తుత సమాజానికి ఇలాంటి చిత్రం అవసరం" అని చెప్పారు. "ఈ సినిమా విడుదల తర్వాత ఇలాంటి తరహా కథలు మరిన్ని తెరకెక్కుతాయి. మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది" అని ఎమ్మెల్యే అద్దంకి దయాకర్ చెప్పారు. "ప్రపంచంలో ప్రతీ మూలకు వెళ్లగలిగేది సినిమా మాత్రమే" అని దర్శకుడు బొమ్మకు మురళీ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక్, డీఓపీ: జి.ఎల్.బాబు, సంగీతం:ఎమ్.ఎమ్.కీరవాణి.

మంచి కంటెంట్‌తో రేవు



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి డాక్టర్ మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను డైరెక్టర్ బాబీ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ సినిమా విజువల్స్ బాగున్నాయి. మంచి కంటెంట్ ఉన్న ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది" అని అన్నారు. "ఇదొక విభిన్న తరహా సినిమా. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది" అని దర్శకుడు హరినాథ్ పులి చెప్పారు. ఈ సినిమాకు ఎడిటర్: శివ శర్వాని, డీఓపీ: రేవంత్ సాగర్, నిర్మాణ పర్యవేక్షణ: సీనియర్ జర్నలిస్ట్ ప్రభు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పర్వతనేని రాంబాబు.



వ్యవస్థాపక దినోత్సవంలో అతిథులు, అధ్యాపకులు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

వ్యవసాయ కళాశాలకు అంతర్జాతీయ ఖ్యాతి

- రాజమండ్రి ఐటీసీ లిమిటెడ్ సీనియర్ లీడ్ సైంటిస్ట్, కళాశాల పూర్వవిద్యార్థి డాక్టర్ బి.ఎస్.రామచంద్రారెడ్డి
- ఘనంగా బాపట్ల వ్యవసాయ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

బాపట్ల, జూలై 16: బాపట్ల వ్యవసాయ కళాశాల అంతర్జాతీయ ఖ్యాతినార్జించిందని రాజమండ్రి ఐటీసీ లిమిటెడ్ సీనియర్ లీడ్ సైంటిస్ట్, కళాశాల పూర్వవిద్యార్థి డాక్టర్ బి.ఎస్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాల 79వ వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం కళాశాలలోని డాక్టర్ బీవీనాథ్ ఆడిటోరియంలో జరిగింది. కార్యక్రమానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి అధ్యక్షత వహించారు. రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఈ కళాశాల పూర్వవిద్యార్థిగా తాను కష్టపడే తత్వం, పట్టుదలలాంటి లక్షణాలు ఈ ప్రాంగణంలోనే నేర్చుకున్నానని చెప్పారు. ప్రయత్నించి ఓడిపోయినా పర్వాలేదు. కానీ ప్రయత్నించటంలో ఓడిపోవద్దని చెప్పారు. ఎంతఎత్తు ఎదిగినా మానవత్వాన్ని, సేవాభావాన్ని మరిచిపోవద్దని వివరించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ గాజుల రామచంద్రరావు మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నతమైన వ్యవసాయ కళాశాల బాపట్లలో ఉందన్నారు. ఉత్తమ సాంకేతిక ప్రచురణలు చేసిన విద్యార్థులు బి.రెడ్డి లక్ష్మీ, ఎం.బాలభారతి, ఎ.కావ్యలను పతకాలతో సత్కరించారు. విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పి.లక్ష్మీ సాహితి, కె.కావ్యలకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీజీటీసీడీ ఎగ్జిక్యూటివ్‌మెంబరు డాక్టర్ కె.సుశీల, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లాల్ అహ్మద్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణిలు కళాశాల పురోగతిని వివరించారు. దేశంలోనే అత్యుత్తమైన బీపీటీ 5204 వరి వంగడాన్ని 1983లో డాక్టర్ ఎం.వి.రెడ్డి ఇక్కడే సృష్టించారని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ ఆచార్యులు డాక్టర్ గోపిచంద్ర, డాక్టర్ బాలినేని వెంకటేశ్వర్లు, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ ఉల్లి శంకరరావు, డాక్టర్ పి.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ జి.సుబ్బయ్య, డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ పి.హరిప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. పూర్వ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు సి.హెచ్.కోటేశ్వరరావు, కోల్, ఐ.కోటేశ్వరరావులను సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

19న అరుణాచలానికి మూడు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గుంటూరు, జూలై 16: ఈ నెల 21న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 19న రాత్రి 9.15, 9.30, 9.45 గంటలకు బయల్దేరి 20వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాక, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని ఆ రోజు రాత్రి అక్కడే బస చేసి 21న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదేరోజు సాయంత్రం బయల్దేరి 22వ తేదీన ఉదయం 6.30, 6.45, 7గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటాయన్నారు. 96164, 96089, 91700 సర్వీసులకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. ఒక్కోచార్జీ రూ.2420గా పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459 నంబరులో సంప్రదించాలని కోరారు.

రోజుకు సగటున 5 వేల టన్నుల ఇసుక సరఫరా

- వారంలోనే రూ.కోటి మేర ప్రజలకు లబ్ధి
- ఇంకా స్టాక్‌పాయింట్లలో 9 లక్షల ఎంటీలకు పైగా ఇసుక లభ్యత



గుంటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానం ద్వారా జిల్లా ప్రజలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతున్నది. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్టాక్‌యార్డు వద్ద కేవలం ఇసుకకే టన్నుకు రూ.450వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఉండటంతో అప్పట్లో లారీ ఇసుక రూ.25వేలు దాటిపోయేది. ఇప్పుడు ఇసుక ఉచితంగా ప్రభుత్వం ఇస్తుండటంతో ప్రజలు కేవలం లోడింగ్, రవాణాఛార్జీలు మాత్రమే భరించి తీసుకెళుతున్నారు. దీనివలన 20 టన్నుల లారీపై ఇసుక ఛార్జీల రూపంలో రూ.5వేలు ఆదా అవుతున్నది. జిల్లాలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న ఉచిత ఇసుక సరఫరా ఎలాంటి సమస్యలు లేకుండా సజావుగా సాగుతున్నది. ఒకటి, రెండు చోట్ల మాత్రం వర్షాల కారణంగా స్టాక్‌యార్డు వద్దకు లారీలు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. దీనివలన అక్కడ మందకొడిగా ఇసుక సరఫరా జరుగుతోంది.

జిల్లాలో మొత్తం ఐదు స్టాక్‌యార్డుల ద్వారా ప్రజలకు ఉచిత ఇసుక సరఫరా జరుగుతున్నది. ఈ విధానాన్ని ప్రారంభించేనాటికి అన్ని స్టాక్‌యార్డుల్లో కలిపి 9,23,372.45 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉన్నది. వర్షాకాలంలో కృష్ణానదికి వరద పోటెత్తినా ఇసుకకి ఎలాంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా ఈ స్టాక్‌యార్డుల్లో నిల్వలు సరిపోతాయి. కొల్లిపరలో ఇప్పటి వరకు 6,738.5 మెట్రిక్‌టన్నుల ఇసు కని ప్రజలు ఉచితంగా తీసుకెళ్లారు. అలానే మున్నంగిలో 3,062, గుండిమెడలో 566, తాళ్లాయపాలెంలో 3,146.399, లింగాయపాలెంలో 6394 మెట్రిక్ టన్నుల ఇసుకని ప్రజలకు సరఫరా చేశారు. వీటిన్నింటిని కలిపితే దాదాపుగా 20 వేల మెట్రిక్‌టన్నులకు పైగా ఇసుక ఇళ్ల నిర్మాణాలకు చేరింది. దీనివలన ఇసుక ఛార్జీల రూపంలో ప్రజలకు రూ.కోటి వరకు ఆదా అయింది.

కాగా లోడింగ్ ఛార్జీల రూపంలో టన్నుకు రూ.250 చొప్పున రాష్ట్ర ప్రభుత్వానికి రూ.50లక్షల వరకు ఆదాయం సమకూరింది. కొన్ని నెలల క్రితమే ఇరిగేషన్ శాఖ తన సొంత నిధులను వెచ్చించి కృష్ణానదిలో నుంచి ఇసుక పూడికని తొలగించి స్టాక్‌యార్డుల్లో గుట్టలుగా పోసింది. అందుకు అయిన ఖర్చు ఇప్పుడు కొంతమేరకు లోడింగ్ ఛార్జీల రూపంలో సమకూరుతున్నది. గుంటూరు నగరానికి వేర్వేరు స్టాక్‌యార్డుల నుంచి ఇసుక వస్తున్నది. ఇక్కడికి చేరేసరికి 10 టన్నుల లారీ అయితే లోడింగ్, రవాణ ఛార్జీలు కలిపి రూ.7,500నుంచి రూ.8వేల వరకు తీసుకుంటున్నారు. అదే 10 టైర్ల లారీ అయితే రూ.13వేల నుంచి రూ.14వేల వరకు వసూలు చేస్తున్నారు. అదే గత వైసీపీ ప్రభుత్వం ఈ ఛార్జీలు రెట్టింపు మోతాదులో ఉండేవి. అప్పటి ధరతో బేరీజు వేస్తూ చిన్న లారీకి అయితే రూ.4,500, 10 టన్నుల లారీకి అయితే రూ.10వేల వరకు మిగులుతున్నట్లు భవన నిర్మాణదారులు చెబుతున్నారు.

జగనన్న కాలనీ కోసం అధికారుల అత్యుత్సాహం

- మురుగు కాల్వను పూడ్చివేసిన వైనం
- మురుగు పారక గత నాలుగేళ్లుగా రైతుల పాట్లు
- 110 ఎకరాల్లో మురుగునీటి పారుదల ప్రశ్నార్థకం



మురుగుకాల్వ పూడ్చివేసి జగనన్న ఇంటిస్థలాలకు కేటాయించిన భూమి

మూల్పూరు వద్ద పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



అమృతలూరు, జూలై 16: అధికారుల అత్యుత్సాహానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మూల్పూరులో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇంటిస్థలాల కోసం రైతుల నుండి భూములు సేకరించారు. ఈ సేకరించిన భూముల్లో నుండి మురుగు బయటకు వెళ్లే కాల్వను పూడ్చివేసి పేదలకు ఇళ్లస్థలాలను కేటాయించారు. ఈ కాల్వ పూడ్చడం వల్ల 110 ఎకరాల్లో నుండి పారుదల కావాల్సిన మురుగు నీరు తమ పంట పొలాల్లోనే నిలిచిపోతుందని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేస్తామని, రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామని వారు హామీ ఇచ్చారు. గత నాలుగేళ్లుగా తాము పడుతున్న ఇబ్బందిని అధికారులు దృష్టికి తీసుకువెళుతున్నా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. ఈ ఏడాది పొలాల్లో వెద నాటు వేశామని కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంట పొలాల్లో నీరు నిలవడంతో మురుగునీరు బయటకు పోక వెదనారు దెబ్బతింటోందని రైతులు చెబుతున్నారు. ఆర్థికంగా నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

బొప్పూడి వెంకటేశ్వరస్వామికి ప్రత్తిపాటి ప్రత్యేకపూజలు

- తొలి ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

చిలకలూరిపేట అర్బన్, జూలై 16: రాష్ట్రంలో మొదలైన అభివృద్ధి యజ్ఞానికి ఎలాంటి ఆటంకాలు కలగకూడదని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేకపూజలు నిర్వహించారు. బుధవారం విశిష్టమైన తొలి ఏకాదశిని పురస్కరించుకొని చిలకలూరిపేట మండలం బొప్పూడి కొండపై ఉన్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముందస్తు పూజలు చేశారు. తొలి ఏకాదశి పర్వదినం ఏర్పాట్లపై అధికారులతో చర్చించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వాకి ఆ దేవుడి ఆశీస్సులు ఎప్పుడూ మెండుగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల వ్యవధిలోనే ఇచ్చిన హామీల్లో సింహభాగం అమలు చేస్తూ ప్రజలకు చేరువయ్యామని, ఆ అక్కసుతోనే వైసీపీ అసత్య ప్రచారాలకు దిగుతోందని, వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డికి ఇకనైనా మంచిబుద్ధిని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. తొలుత ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ కృష్ణమోహన్ దంపతులను ప్రత్తిపాటి మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జువ్వాజి మదన్ మోహన్, ఇతర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఏపీకి చెందిన ఇద్దరికి అవార్డు

- కేంద్ర మంత్రి జితిన్ ప్రసాదుచే ప్రదానం



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న ఆలపాటి సంధ్య, నార్నె గోపీనాథ్

చిలకలూరిపేట, జూలై 16: కామన్ సర్వీసెస్ సెంటర్ ద్వారా వినియోగ దారులకు అత్యుత్తమ రీతిలో సేవలను అందించినందుకుగాను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరికి కేంద్ర ప్రభుత్వం అత్యున్నత సేవా అవార్డులు ఇచ్చింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి జితిన్ ప్రసాదు మంగళవారం కొత్త ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును వారికి అందజేశారు. అవార్డును అందుకున్న వారిలో నిజాంపట్నంకు చెందిన ఆలపాటి సంధ్య, చిలకలూరిపేటకు చెందిన నార్నె గోపీనాథ్ ఉన్నారు. కామన్ సర్వీసెస్ సెంటర్ ద్వారా అత్యధిక సంఖ్యలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాల లావాదేవీలను జరిపినందుకు వారికి ఈ అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రజలకు ఉత్తమ రీతిలో సేవలందించిన పదిమందిని గుర్తించింది. వారిలో ఏపీకి చెందిన ఈ ఇద్దరు ఉన్నారు. ఆలపాటి సంధ్య 1,02,952, నార్నె గోపీనాథ్ 84,526 లావాదేవీలు గత ఆర్థిక సంవత్సరంలో జరిపి జాతీయస్థాయిలో వరుసగా 2, 3 స్థానాల్లో నిలిచారు. వారిని ప్రభుత్వం అన్ని ఖర్చులు భరించి ఢిల్లీకి ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కారం చేశారు.

బాపట్ల టౌన్‌హాలుకు 119 వసంతాలు



బాపట్ల పట్టణంలోని టౌన్‌హాలు

బాపట్ల, జూలై 16: చారిత్రాత్మకమైన బాపట్లటౌన్‌హాలు నిర్మించి 119 సంవత్సరాలు పూర్తైంది. 1905 జూలై 17న అప్పటి జిల్లా కలెక్టర్ బ్రూడీ దీనిని ప్రారంభోత్సవం చేశారు. ప్రభుత్వ ఆర్థికసహాయం లేకుండా ప్రజల విరాళాలతో టౌన్‌హాలు నిర్మించారు. ఇంగ్లాండ్‌లో పట్టాభిషిక్తుడవుతున్న అప్పటి భారత చక్రవర్తి ఎడ్వర్డ్ గౌరవార్థంగా దీనికి ఎడ్వర్డ్ పట్టాభిషేక స్మారకటౌన్‌హాలుగా నామకరణ చేశారు. రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ టౌన్‌హాలు పట్టుగొమ్మగా నిలిచింది. సర్వకళల కేంద్రంగా, బాపట్ల జీవనాడిగా విరాజిల్లింది. జాతిపిత మహాత్మా గాంధీ, జవహర్‌లాల్‌నెహ్రూ, డాక్టర్ బాబురాజేంద్రప్రసాద్ వంటి ఎందరో జాతీయ నాయకులు ఇక్కడ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 1913 మే నెలలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభకు టౌన్‌హాలు వేదికగా నిలిచింది. తెలుగు ప్రజల స్వరాష్ట్ర వాంఛకు టౌన్‌హాలు ముత్యాలపందిరి వేసింది. బాపట్లలో టౌన్‌హాలు నిర్మించాలని 1902 డిసెంబరు 5న జరిగిన ఒక సమావేశంలో నిర్ణయించారు. అప్పటి బాపట్ల తహసీల్దార్ కె.శేషాచలపతిపంతులు ఆధ్వర్యంలో అధికారులు, న్యాయవాదులతో ఒక పట్టాభిషేక స్మారకకమిటీ ఏర్పాటైంది. అప్పటి బాపట్ల తాలూకా మిరాశీదారుగా ఉన్న జాగర్లమూడి నాయుడు ఆధ్వర్యంలో గ్రామగ్రామం తిరిగి టౌన్‌హాలు నిర్మాణానికి విరాళాలు సేకరించారు. జమ్ములపాలెం మిరాశీదారు కుర్రా ముత్తయ్యచౌదరి, న్యాయవాదులు దేశిరాజు కృష్ణయ్యపంతులు, చేరగూడి వెంకటాద్రిపంతులు టౌన్‌హాలు నిర్మాణానికి స్థలం ఇవ్వటానికి ముందుకొచ్చారు.

యూపీహెచ్‌సీని తనిఖీ చేసిన ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్



ఆరోగ్యశ్రీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ ఆరాధనా పట్నాయక్

తాడేపల్లి టౌన్, జూలై 16: తాడేపల్లి డ్రైవర్స్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ ఆరాధనా పట్నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. రాష్ట్రంలో గత ఏడాది కాలంగా జాతీయ నాణ్యతా ప్రమాణాల హామీ విధి విధానాలు అమలుచేస్తూ అర్హతపత్రాలు పొందిన అన్ని ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అదేస్థాయిలో నాణ్యతా ప్రమాణాలు కొనసాగిస్తారా లేదా అనేది ప్రత్యక్షంగా పరిశీలించేందుకు కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వ శాఖ నుండి ఐఏఎస్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆరాధనా పట్నాయక్ సందర్శించారు. యుపీహెచ్‌సీలో 12 రకాల విభాగాలలో అందుతున్న సేవలు, వాటి కంప్యూటరీకరణ, రికార్డులలో ఏవిధంగా నిక్షిప్తం చేస్తున్నది.. ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి స్థానిక వైద్యాధికారి డాక్టర్ మానసను అడిగి తెలుసుకున్నారు. పరిశీలన అనంతరం బృంద సభ్యులు ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, హెచ్‌డబ్ల్యూసీ రాష్ట్ర నోడల్ అధికారి శ్యామల, స్టేట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ దేవి, డీపీఎంవోఓ డాక్టర్ రత్నమన్‌మోహన్, డీపీవో సైమన్, ఆర్కేఎస్‌కే స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిర్మలాగ్లోరిలు సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రత్నమోహన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గురుకుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీమన్నారాయణ, హెచ్‌వీ రమాదేవి, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన పీఏసీఎస్ యూనియన్ సభ్యులు



మంత్రి అచ్చెన్నాయుడికి మెమోరాండం అందజేస్తున్న జిల్లా సహకార సంఘ నాయకులు

ప్రత్తిపాడు, జూలై 16: జిల్లా ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు ముప్పా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వైవీ నారాయణ, వర్కింగ్ ప్రసిడెంట్ దొప్పలపూడి శ్రీనివాసరావులు సహకార శాఖా మంత్రి అచ్చెన్నాయుడిని మంగళవారం కలుసుకున్నారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడి ఛాంబర్‌లో ఆయన్ను కలుసుకుని సహకార సంఘ ఉద్యోగులు కోర్కెలు తీర్చాలని వేడుకున్నారు. దీనికి సంబంధించి మెమోరాండాన్ని మంత్రికి అందజేశారు. రాష్ట్రంలో 2051 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో ఏడు వేలకు పైగా ఉద్యోగులు వివిధ హోదాలలో విధులు నిర్వహిస్తూ రైతులకు సేవలు అందిస్తున్నారని వారు తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సహకార ఉద్యోగులకు దేశంలోనే తొలిసారి 2016లో మానవ వనరుల విధానం అమలుపై ఒక కమిటీని నియమించి జీవో నెంబరు 36 రూపంలో పూర్తిస్థాయిలో అమలు చేస్తూ ఉద్యోగులకు భద్రత కల్పించడం జరిగిందన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం 36 జీవోను సవరణ చేస్తూ, అందులోని కొన్ని అంశాలను రద్దు చేసి 2020లో జీవో నెంబరు 90 విడుదల చేయడం జరిగిందని, అవి ఇంతవరకు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని మంత్రికి వివరించారు. అంతేకాకుండా 2014 నుండి జరగాల్సిన వేతన సవరణ 2024 వరకు కూడా అమలుకు నోచుకోలేదన్నారు. ఉద్యోగుల భద్రతకు సంబంధించి పలు విషయాలను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకురావడంతో పాటు ఈ ప్రభుత్వం ఉద్యోగులకు కల్పించాల్సి భద్రతను వివరిస్తూ మెమోరాండం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు.. వీటిని పరిశీలించి త్వరలోనే సహకార సంఘ ఉద్యోగులకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

గుంటూరు మీదగా నాలుగు రైళ్ల దారి మళ్లింపు

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - గూడూరు మధ్యన మూడో రైలుమార్గం నిర్మాణ పనుల కారణంగా నాలుగు రైళ్లను గుంటూరు మీదగా మళ్లిస్తున్నట్లు సదరన్ రైల్వే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. నెంబరు. 22878 ఎర్నాకుళం - హౌరా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22, 29 తేదీల్లో రేణిగుంట, యర్రగుంట్ల, నంద్యాల, గుంటూరు మీదగా విజయవాడకు చేరుకొని అక్కడి నుంచి రెగ్యులర్ మార్గంలో ప్రయాణిస్తుంది. నెంబరు.22841 సంత్రగచి జంక్షన్ - తాంబరం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22, 29 తేదీల్లో విజయవాడ నుంచి తెనాలి మార్గంలో కాకుండా గుంటూరు, నంద్యాల, యర్రగుంట్ల, రేణిగుంట, చెన్నై ఎగ్మోర్ మీదగా తాంబరం చేరుకొంటుంది. నెంబరు. 22863 హౌరా - ఎస్ఎంవీటీ బెంగళూరు ఏసీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22న గుంటూరు, నంద్యాల, యర్రగుంట్ల, రేణిగుంట మీదగా ప్రయాణిస్తుంది. నెంబరు. 12651 మధురై - నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23, 30 తేదీల్లో చెన్నై ఎగ్మోర్, రేణిగుంట, యర్రగుంట్ల, నంద్యాల, గుంటూరు మీదగా విజయవాడకు చేరుకొని అక్కడి నుంచి రెగ్యులర్ రూట్‌లో ప్రయాణిస్తుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

పల్నాడు జిల్లాలో 10మంది సీఐలకు పోస్టింగ్

గుంటూరు, జూలై 16: పల్నాడు జిల్లాలో పదిమంది సీఐలకు పోస్టింగ్స్ ఇస్తూ రేంజ్ ఐజీ ఎస్ఎస్ త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఉన్నతాధికారులు సీఐల బదిలీలపై దృష్టి సారించారు. ఆయా ప్రజా ప్రతినిధుల సిఫార్సులతో పాటు వారి ట్రాక్ రికార్డును పరిశీలించి బదిలీల ప్రక్రియ చేపట్టారు. పోస్టింగ్స్ పొందిన సీఐ వివరాలు ఇలా ఉన్నాయి.

1. ఎం.విజయచరణ్, సోషల్‌మీడియా అండ్ సైబర్‌క్రైమ్ సెల్ పల్నాడు నుంచి నరసరావుపేట వన్ టౌన్‌కు
2. ఎస్.సాంబశివరావు, వినుకొండటౌన్‌నుంచి నరసరావుపేటటూటౌన్‌కు
3. యు.శోభన్‌బాబు, పల్నాడుస్పెషల్‌బ్రాంచ్-2నుంచి వినుకొండ టౌన్‌కు
4. పసుపులేటి రామకృష్ణ, వేమూరుసర్కిల్ నుంచి నర్సరావుపేట రూరల్ సర్కిల్‌కు
5. బి.ప్రభాకర్, తుళ్లూరు ట్రాఫిక్-2నుంచి వినుకొండ రూరల్ సర్కిల్‌కు
6. బీ సుబ్బానాయుడు, పల్నాడు ఎస్సీ, ఎస్టీ సెల్ నుంచి చిలకలూరిపేట రూరల్ సర్కిల్‌కు
7. కే వెంకటప్రసాద్, స్పెషల్ బ్రాంచ్-3 నుంచి అచ్చంపేట పీఎస్‌కు
8. ప్రత్తిపాటి సురేష్, రేంజ్‌వీఆర్ గుంటూరు నుంచి పెదకూరపాడు సర్కిల్‌కు
9. ఎం.సుబ్రహ్మణ్యం, రాపూరుసర్కిల్, నెల్లూరు నుంచి సత్తెనపల్లి టౌన్‌కి
10. పోలూరి శ్రీనివాస్, సత్తెనపల్లి టౌన్ నుంచి సత్తెనపల్లి రూరల్‌కి..

పెదరావూరు ఆలయంలో అర్ధరాత్రి చోరీ..!

- సుమారు రూ.లక్ష విలువైన అమ్మవారి నగల అపహరణ

తెనాలి రూరల్, జూలై 16: మండలంలోని పెదరావూరులో కొలువుదీరిన శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పెదరావూరులోని శ్రీభ్రమరాంబసమేత శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించారు. స్వామివార్లకు వేర్వేరుగా రెండు గర్భగుడులు ఉండటంతో రెండు తాళాలు ధ్వంసం చేశారు. అమ్మవారి విగ్రహానికి అలంకరించిన వెండి, బంగారు నగలను చోరీ చేశారు. స్వామివారి నగలు మూటకట్టి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా అవి బరువుగా ఉండటంతో మూట ఆలయప్రాంతంలో వదిలేశారు. ఆలయంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల డీవీఆర్‌ను సైతం చోరీ చేశారు. చోరీ జరుగుతున్న సమయంలో కొందరు యువకులు ఆలయం ద్వారాలు తెరచి ఉండటాన్ని గమనించి గ్రామస్తులను మేల్కొపారు. వారు రావడాన్ని గమనించిన దొంగలు నగలతో పారిపోయారు. గతంలో కూడా ఈ ఆలయంలో చోరీకి ప్రయత్నించగా గ్రామస్తులు వెంబడించడంతో పారిపోయారు. సుమారు రూ.1లక్ష విలువైన నగలు అపహరణకు గురైనట్లు ఆలయ ఈవో శ్యాంసుందర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. క్లూస్‌టీం సహాయంతో వివరాలు సేకరిస్తున్నారు.

36,277 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 37,622 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 36,277 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 16,875 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	800016000	
నెంబరు. 5	8500	16000
273	11000	13500
341	8500	16500
4884	–	–
సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	18500
బ్యాడిగి	9000	16000
దేవనూరుడీలక్స్	9000	15000
తెల్లకాయలు	4000	12000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	9000	15500
నెంబరు. 5	8500	14000
273	–	–
341	11000	15500
4884	15500	16200
సూపర్ 10	–	–
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8800	18000
బ్యాడిగి	9000	15000
దేవనూరుడీలక్స్	–	–
తెల్లకాయలు	5000	11000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నా సంతకాన్ని ఫోర్జరీ చేశారు : తహసీల్దార్ గీతావాణి

దాచేపల్లి, జూలై 16: తన సంతకాన్ని ఫోర్జరీ చేసిన నిందితులు దాచేపల్లి మండలంలోని మాదినపాడు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ షేక్ చినసైదులు కుమారుడు షేక్ నాగుల్ మీరాపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు దాచేపల్లి తహసీల్దార్ గీతావాణి మంగళవారం తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. మండలంలోని కాట్రపాడు గ్రామానికి చెందిన నరేంద్రవర్మ, దాచేపల్లికి చెందిన నరసింహారావుల భూముల కు సంబంధించిన పత్రాలపై తన సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించి స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫోర్జరీకి పాల్పడిన నిందితుడు షేక్ నాగుల్‌మీరాపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు అరెస్టు చేయకపోవడం ఏమిటని స్థానిక ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

విజయపురిసౌత్ హెచ్‌డబ్ల్యూసీకి ఉత్తమ సర్టిఫికెట్

మాచర్ల రూరల్, జూలై 16: మండలంలోని విజయపురిసౌత్-2 హెచ్‌డబ్ల్యూసీ (హెల్త్ వెల్‌నెస్ సెంటర్)కు జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాల పర్యవేక్షణ సంస్థ (ఎన్‌క్యూయూఏఎస్) ఉత్తమ సర్టిఫికెట్‌ను అందించినట్లు కొప్పునూరు పీహెచ్ వైద్యాధికారి ఓరుగంటి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన ఎన్‌క్యూయూఏఎస్ సంస్థ బృందం కొప్పునూరు పీహెచ్‌సీ పరిధిలో గల విజయపురిసౌత్-2 హెచ్‌డబ్ల్యూసీని సందర్శించి వైద్యసేవలను పరిశీలించారన్నారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందించగా ఉత్తమ సర్టిఫికెట్‌ను అందించారని చెప్పారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ చారి, పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఏఎన్ఎం కుమారి, సుజాత తదితరులు అభినందించారు.

తహసీల్దార్ ఎస్ రామ్మోహనరావు మృతి


సబ్బు రామ్మోహనరావు (ఫైల్ ఫొటో)

రెంటచింతల, జూలై 16: మండలంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న సబ్బు రామ్మోహనరావు(59) మంగళవారం వేకువజామున ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన 30 సంవత్సరాల పాటు రెవెన్యూలో పనిచేసి నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నుంచి సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 9న రెంటచింతలకు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నెల 1న రైలులో వస్తూ పడిపోవడంతో రైల్వే పోలీసులు సత్తెనపల్లికి అక్కడ నుంచి గుంటూరులోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించి బ్రెయిన్‌డెడ్‌కు సంబంధించి చికిత్స చేస్తున్నారు. ఆయనకు భార్య విజయలక్ష్మి ఇద్దరు సంతానం. రెవెన్యూ ఉద్యోగులంతా ఒంగోలుకు వెళ్లి రామ్మోహనరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి సంతాపం

తహసీల్దార్ రామ్మోహనరావు మృతి చెందడంపై స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తీవ్ర విచారాన్ని దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. మంగళవారం విలేకరులతో ఫోన్లో మాట్లాడుతూ గత నెలలో తనను సన్మానించిన విషయాన్ని గుర్తు చేస్తూ అర్ధాంతరంగా తనువు చాలించడం బాధాకరమన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వపరంగా ఎలాంటి సహాయమైనా అందిస్తానన్నారు.

ఎంఈవో -1గా ఏసుబాబు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న వి.ఏసుబాబు

రెంటచింతల, జూలై 16 : ఎంఈవో -1గా వి.ఏసుబాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 34 సంవత్సరాల నుంచి టీచింగ్‌లో ఉన్న ఏసుబాబు నరసరావుపేట నుంచి రెంటచింతల 1కు బదిలీ చేస్తూ ఆర్జేడి బి.లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం సత్తెనపల్లి డీవైఈవోగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి దాకా ఎంఈవో -1గా పనిచేసిన వేముల నాగయ్య ఈనెల 5న ఉద్యోగ విరమణ చేశారు. ఎంఈవో ఏసుబాబును వివిధ సంఘాలకు చెందిన టీచర్లు, సీఆర్పీ సిబ్బంది సత్కరించారు.

మాచవరం ఎంఈవోగా అట్లూరి


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరెడ్డి

మాచవరం, జూలై 16: మాచవరం ఎంఈవోగా అట్లూరి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న రాజకుమారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జ్ ఎంఈవోగా శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ టీఈవో నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు మాచవరం విద్యావనరుల కేంద్రానికి చేరుకొని శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచవరం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయానుకూలంగా పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, ప్రతిరోజు ఏదో ఒక పాఠశాలను సందర్శిస్తామని ఆయన తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచే విధంగా చర్యలు చేపడతానన్నారు.

అంగన్‌వాడీ కోడిగుడ్ల పంపిణీలో గోల్‌మాల్

కారంపూడి, జూలై 16: అంగన్‌వాడీ సెంటర్‌కు నాలుగు దఫాలుగా కోడిగుడ్లు రావాల్సి ఉండగా మూడో విడతకే మొత్తం తీసుకొని వాటిని రికార్డుల్లో రాయకుండా, పంపిణీ చేయకుండా మాయం చేసినట్లు గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో 37 మంది విద్యార్థులు, 19 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నట్లుగా చూపారని, క్షేత్రస్థాయిలో అంత మొత్తంలో లబ్ధిదారులు లేరని సూపర్‌వైజర్ ఉమాదేవి తెలిపారు. కేంద్రానికి వచ్చిన కోడిగుడ్ల పంపిణీలో కార్యకర్త గోల్‌మాల్ చేసినట్లు చెప్పారు. పేటసన్నిగండ్ల శివారులోని పోతురాజుగుట్ట 151వ కేంద్రంలో సోమవారం రాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలించారు. గతంలో ఈ అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అరకొరగా సరుకులు పంపిణీ చేసి మిగతా వాటిని బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాల్య వివాహాలు నిరోధించాలి

అచ్చంపేట, జూలై 16: బాల్య వివాహాలను నిరోధించి బాలికలపై శ్రద్ధ వహించి ఉన్నత చదువులు చదివించాలని అచ్చంపేట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్ మాణిక్య అన్నారు. మంగళవారం అచ్చంపేటలోని కస్తూర్బా బాలికల పాఠశాలలోను, అంగన్‌వాడీ కేంద్రంలో భారతీయ న్యాయ సంహిత కార్యక్రమాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గృహ హింస చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని, కిశోర బాలికలు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ రంగాల్లో అత్యుత్తమంగా రాణించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌తో, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

సత్తెనపల్లి, జూలై 16 : కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నూతన చట్టాలను నిలుపుదల చేయాలని నిరసిస్తూ సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించి న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. నూతన చట్టంలో న్యాయవాదుల అధికారాలను కూడా పోలీసులకు కట్టబెట్టారన్నారు. కార్యక్రమంలో మర్రి సుబ్బారెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు చేయూత

సత్తెనపల్లి, జూలై 16: పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లిషు మీడియం స్కూల్లో 2003- 2004 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాలలో చదువుతున్న మెరిట్ విద్యార్థులకు రూ.40వేల ప్రోత్సాహక నగదును అందజేశారు. మరో పూర్వ విద్యార్థి ఎల్ సురేష్ ముగ్గురు విద్యార్థులకు పుస్తకాలు, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. పూర్వ విద్యార్థులు సురేష్, సూర్య, లక్ష్మణ్‌కుమార్, మోహన్‌లను పాఠశాల ప్రిన్సిపాల్ విజయరాణి అభినందించారు.

దేవాలయ భూములు పేదకౌలుదారులకు ఇవ్వాలి

దాచేపల్లి, జూలై 16: నియోజకవర్గంలోని దేవాలయ భూములను పేద కౌలుదారులకు నామమాత్రపు కౌలుకు ఇవ్వాలని రాష్ట్ర రైతుకూలీ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు మోమిన్ సైదల్లి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పేద కౌలుదారులు ఐదు సంవత్సరాలుగా పంటలు పండక ఆర్థికంగా కృంగిపోయారని తెలిపారు. దేవదాయశాఖ నిర్ణయించిన కౌలుకు భూములు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం పేద కౌలుదారులను ఆదుకోవాలని కోరారు.

గ్రామాల సుస్థిర అభివృద్ధికి నిర్మాణాత్మక ప్రణాళిక

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


పెదకూరపాడులో పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, జూలై 16 : గ్రామాల సుస్థిర అభివృద్ధికి నిర్మాణాత్మకమైన ప్రణాళికతో ముందుకెళుతున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. పెదకూరపాడులో టీడీపీ ప్రభుత్వ పాలనలో నిర్మించిన పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ ప్రాంగణాన్ని పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. రాబోయే రోజుల్లో కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. నిర్లక్ష్యానికి గురైన విలేజ్ పార్కు, చెరువుపై వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించి అభివృద్ధి చర్యలు చేపడతామన్నారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సహకారంతో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, పెదకూరపాడు గ్రామం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదనను తీసుకువచ్చి పనులు చేస్తుండగా వైసీపీ ప్రభుత్వం రింగ్‌రోడ్డు ప్రతిపాదనను విస్మరించిందని టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, గ్రామసర్పంచ్ గుడిపూడి రాజు ఎమ్మెల్యే ప్రవీణ్‌కు వివరించారు. ఈ సందర్భంగా దాతల దాతృత్వంతో పెదకూరపాడులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి ఇచ్చిన స్థలంలో భవననిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే మెటీరియల్ తోలించిన తరువాత పనులు జరగకుండానే కాంట్రాక్టర్ తోలిన మెటీరియల్ ను వెనక్కి తీసుకెళ్లారన్నారు. ఆ భవనాన్ని నిర్మించాలని, ఆ స్థలాన్ని కూడా పరిశీలించాలని ఎమ్మెల్యే ప్రవీణ్‌కు గ్రామస్థులు చెప్పటంతో స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు తప్ప అభివృద్ధిని విస్మరించిందన్నారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, సర్పంచ్ గుడిపూడి రాజు, మండల నేతలు ఏటుకూరి బ్రహ్మయ్య మక్కెన సాగర్, మద్దినేని వెంకట సత్యనారాయణ, షేక్ మస్తాన్ షరీఫ్, చెన్నుపాటి బుల్లిబాబు, ఉప ఎంపీపీ షేక్ బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి ఎమ్మెల్యే ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని నియోజకవర్గ కార్యాలయంలో ఆరోగ్య శాఖ అధికారులు, డాక్టర్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రజల్లో ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల శుభ్రత గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ వైద్యశాల అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్లు పాల్గొన్నారు.

రాగి వర్ణం కలిగి స్పర్శ లేని మచ్చలను పరీక్ష చేయించుకోవాలి

● వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు


కుంకలగుంట పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ర్యాలీ

నకరికల్లు, జూలై 16 : చర్మంపైన స్పర్శ లేని రాగి వర్ణం కలిగిన మచ్చలుంటే పరీక్ష చేయించుకోవాలని కుంకలగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం కుంకలగుంట పీహెచ్‌సీలో ఎల్‌సీడీసీ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు లెప్రసీ కొత్త కేసులను కనుగొనేందుకు సర్వే నిర్వహిస్తున్నందుకు వెంకటేశ్వర్లు తెలిపారు. ఆశా కార్యకర్తలకు కుష్ఠు వ్యాధి లక్షణాల గురించి, సర్వే నిర్వాహణ గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌వీ ప్రశాంత కుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

క్రోసూరు, జూలై 16 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 18 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జరిగే కుష్ఠు వ్యాధి సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు కోరారు. కార్యక్రమం ఏర్పాట్లపై మంగళవారం ఆయన వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, సీహెచ్‌వో సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి, జూలై 16: పట్టణంలోని పీహెచ్‌సీలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల సిబ్బందికి డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్ఠు బాధితులను గుర్తించే కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు లాస్య భాను ప్రకాష్, డీపీఎంవో నాగేశ్వరరావు, సూపర్ వైజర్ గ్రేసు, పట్టణంలోని నాలుగు అర్బన్ హెల్త్‌సెంటర్ల సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ఇంటింటికి అవగాహన


లెనిన్‌నగర్‌లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న మెప్మా సిబ్బంది

పిడుగురాళ్ల, జూలై 16: లెనిన్‌నగర్, మారుతీనగర్, సంద్రపాలెం ప్రాంతాల్లో మెప్మా సిబ్బంది మంగళవారం ఇంటింటికి వెళ్లి పరిసరాల శుభ్రత, చేతులు శుభ్రత, కాచి చల్లార్చిన నీటిని తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. డయేరియా, సీజనల్ వ్యాధుల బారి నుంచి పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను మెప్మా అధికారులు శ్రీనివాసరావు, ఆర్‌పీలు, పొదుపు సంఘ మహిళలు వివరించారు.

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను మంగళవారం వైద్యాధికారులు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. పల్నాడు జిల్లా వైద్యాధికారి రవి, వైద్యసిబ్బంది కొద్దిరోజులుగా డయేరియా బారిన పడి కోలుకున్న బాధితులను పరామర్శించడంతో పాటు పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు బాల అంకమ్మబాయి, అన్వేష్, నస్రీన్, ఎంపీహెచ్‌ఈవోలు పట్టాభి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన డయేరియా

వారం రోజులుగా పలువురు డయేరియా బారిన పడటంతో వైద్యాధికారులు తక్షణ చర్యలు తీసుకున్నారు. మంగళవారం ఆయా ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదు కాలేదని వైద్యాధికారులు తెలిపారు. డయేరియాను త్వరగా కట్టడి చేసేందుకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్పందించి అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ కూడా రెండు రోజుల వ్యవధిలోనే రెండుసార్లు డయేరియా ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్యం మెరుగుదలపై చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. రెండు రోజులుగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఎప్పటికప్పుడు వైద్యాధికారులతో సంప్రదిస్తూ డయేరియా వివరాలు తెలుసుకుంటున్నారు.

ఘనంగా 10వ షరగత్ వేడుకలు


చావిళ్ళ వద్ద పీర్లతో నృత్యాలు నిర్వహిస్తున్న భక్తులు

బెల్లంకొండ, జూలై 16 : మొహరం పర్వదినం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి షరగత్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు బెల్లంకొండ మూడు చావిళ్ళలోని పీర్లను బయటకు తీసి మొక్కుబడులు మొక్కుకున్న వారు షేరాలు, జట్టీలు కట్టిన తరువాత గ్రామంలో ఊరేగింపు నిర్వహించి పీర్ల చావిడదల వద్ద నృత్యాలు చేశారు. మొహరం పర్వదినం ఆఖరి రోజు కావటంతో పీర్లన్నీ బయటకు తీసి గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు. మొహరం పండుగ సందర్భంగా ముస్లిం యువకులు పలు రకాల వేషాలు ధరించి ప్రజలను ఆకర్షించారు. మూడు చావిళ్ళ వద్ద పండుగ సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మాచవరం, జూలై 16: మాచవరం, తురకపాలెం, వేమవరం, రేగులగడ్డ, గంగిరెడ్డిపాలెం, పిల్లుట్ల, మోర్జంపాడు తదితర గ్రామాలలో మొహర్రం వేడుకలకు ఆయా గ్రామాల పీర్లచావిడిలు విద్యుద్దీపాలతో ముస్తాబయ్యాయి. మంగళవారం రాత్రి ఆయా గ్రామాల పురవీధుల్లో పీర్లను పట్టుకొని మేళతాళాలతో ఊరేగింపుగా తిరిగారు.

జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీలు


గెలుపొందిన జట్టుకు నగదు షీల్డ్ అందజేస్తున్న చికెన్ జానీ బాషా తదితరులు

దాచేపల్లి జూలై 16: పల్నాడు జిల్లా స్థాయిలో మొహరంను పుర స్కరించుకొని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సహకారంతో కబడ్డీ పోటీలు మంగళవారం నిర్వహించారు. నిర్వహకులు తెలిపిన వివరాల ప్రకారం తంగెడ గ్రామంలో మొహరం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా నుంచి 20 టీంలు పాల్గొన్నాయి. విజేతలుగా దాచేపల్లికి చెందిన ఎమ్మెల్సీ టీం ప్రథమ స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో తంగెడ సీనియర్స్ టీం, మూడో స్థానంలో పెదగార్ల పాడు అంకుల్ ఆర్మీ టీం, నాలుగో స్థానంలో తంగెడ జూనియర్స్ టీం విజేతలుగా నిలిచారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

బాలల హక్కులను తెలుసుకోవాలి

పెదకూరపాడు, జూలై 16 : ప్రతి ఒక్కరు బాలల హక్కులను, వారు ఎదుర్కొనే సమస్యలను తెలుసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మున్ని అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులు, ఎదుర్కొనే సవాళ్లపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ అధ్యక్షత వహించగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి వై ప్రశాంత్‌కుమార్ పలు విషయాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా కారు నడిపిన యువకులపై కేసు

దాచేపల్లి, జూలై 16: మద్యం తాగి నలుగురు యువకులు నిర్లక్ష్యంగా కారును పట్టపగలే నడపడంతో అదుపుతప్పిన వాహనం ఓ ఇంట్లోకి దూసుకుపోయింది. ఈ ఘటన దాచేపల్లి మండలంలోని కేశానుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఇంటిముందు కూర్చొని చేటలో బియ్యం ఏరుకుంటున్న సుగుణమ్మ అనే వృద్ధురాలికి గాయాలయ్యాయి. గాయపడిన వృద్ధురాలిని ఆటోలో పిడుగురాళ్ల ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దాచేపల్లి ఎస్ఐ సంధ్యారాణి సంఘటనా స్థలానికి చేరుకొని యువకులను విచారించగా కారంపూడి గ్రామానికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు. వీరు దేవాలయాల నిర్మాణాలలో పనిచేస్తుంటారని వివరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చల్లని తల్లి కార్మెల్ మాత : ఫాదర్ ఎలీషారాజ్


దివ్యపూజాబలి నిర్వహిస్తున్న ఎలీషారాజ్

రెంటచింతల, జూలై 16: కార్మెల్ మాత చల్లని తల్లిలాంటిదని భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతుందని సాగరమాత జూనియర్, విజ్‌డమ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ ఎలీషారాజ్ అన్నారు. మంగళవారం రెంటచింతలలోని మాజీ సర్పంచ్ గుర్రాల రాజుచే నిర్మించిన కార్మెల్‌మాత మందిరం 6వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎలీషారాజ్ భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ కార్మెల్‌మాతను స్మరిస్తే మనకు అండగా ఉంటుందన్నారు. దేవుడిపై ఆధారపడి జీవిస్తూ ఒకే కుటుంబంగా మెలగాలని, ప్రార్థన జీవితంలో భాగమవ్వాలన్నారు.. దుష్టులైనా,మంచివారినైనా కార్మెల్‌మాత సమానంగా చూస్తుందన్నారు. రాత్రింబవళ్లు సర్వేశ్వరున్ని జపిస్తూ ధన్యులవ్వాలన్నారు. సమష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మాజీసర్పంచ్ రాజు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. విద్యుత్ దీప కాంతులతో మందిరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఫాదర్లు డేవిడ్, అగస్టీన్, కన్యాస్త్రీలు, సంఘస్తులు పాల్గొన్నారు.

అందరికీ అన్నదాత సుఖీభవ వర్తింప చేయాలి

నకరికల్లు, జూలై 16: కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఓసీ కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ 20వేలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నేత జీ పిచ్చారావు కోరారు. అలాగే భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కౌలు రైతుల చట్టాన్ని మార్చాలని, లక్షలాది మంది రైతుల సంతకాలు సేకరించి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించనున్నట్లు ఆయన తెలిపారు. కులాలతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులకు, కౌలు రైతులకు వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనల ప్రకారం పంట రుణాలను కౌలు రైతులకు ఇచ్చేవిధంగా బ్యాంకర్లతో మాట్లాడి చర్యలు తీసుకోవాలన్నారు.

కొత్తగణేశునిపాడు ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా పల్లా

మాచవరం, జూలై 16: మండలంలోని కొత్తగణేశునిపాడు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా పల్లా నరేంద్ర నియమితులయ్యారు. గతంలో సర్పంచ్‌గా పనిచేసిన పొందూరి నరసింహారావు వ్యక్తిగత కారణాల వల్ల సెలవు పెట్టడంతో ఉప సర్పంచ్‌గా ఉన్న పల్లా నరేంద్రను ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి నుంచి మంగళవారం ఉత్తర్వులు అందినట్లు ఈవోఆర్‌డీ వెంగళరావు తెలిపారు.

18న జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

సత్తెనపల్లి, జూలై 16: పల్నాడు జిల్లా సబ్ జూనియర్ బాల బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక ఈనెల 18న పట్టణంలోని సుగాలీకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కే సుబ్రహ్మణ్యేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 2011, డిసెంబరు 2012 వరకు జన్మించిన వారై ఉండాలన్నారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, నాలుగు పాసుపోర్టు సైజు ఫోటోలు, తల్లిదండ్రుల సమ్మతిపత్రం వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు 97010 52588లో సంప్రదించాలన్నారు.

జీపీఎస్ గజిట్‌ను రద్దు చేయాలి

సత్తెనపల్లి, జూలై 16 : ప్రభుత్వం జీపీఎస్ గజిట్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఎస్‌టీయూ(ఏపీ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభానీ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కొత్త ప్రభుత్వం జీపీఎస్ గజిట్‌ను ప్రకటించి అక్టోబరు 2023 నుంచి అమల్లోకి వస్తుందని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు సీపీఎస్‌ను ఓపీఎస్‌గా మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. కేంద్రంలో మిత్రపక్షంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యా, కార్మికుల కల అయిన ఓపీఎస్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాల ల్లో పేద పిల్లల విద్యకు గొడ్డలి పెట్టులా ఉన్న జీవో 115ను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలందరికీ తల్లికి వందనం అందేలా చూడాలన్నారు.

నేడు వైకుంఠపురంలో తొలి ఏకాదశి పూజలు

అమరావతి, జూలై 16: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మండలపరిధిలోని వైకుంఠపురంలో భక్తుల కొంగుబంగారంగా పూజలు అందుకుంటున్న కలియుగదైవం వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలిఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఆలయాన్ని సందర్శించే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో విశ్వనాథ్ తెలిపారు. బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక దర్శనాలతో పాటు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉత్తర వాహినీ పుణ్యతీర్థంగా పేరుగాంచిన కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి క్రౌంచగిరిపై కొలువైన స్వయంభువు వెంకటేశ్వరస్వామి, దిగువున కొలువైన వెంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుంటారు.

తొలి ఏకాదశికి అన్ని ఏర్పాట్లు పూర్తి

గురజాలటౌన్, జూలై 16: బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని దైద అమరలింగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు దర్శించుకోవడానికి అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. ఉదయం 4 గంటల నుంచి దర్శనం మొదలవుతుందని దేవదాయశాఖ అధికారి గణపతి సురేష్ తెలిపారు.

నకరికల్లు, జూలై 16: దక్షిణ కాశీగా పేరొందిన చేజర్ల కపోతేశ్వరాలయంలో తొలి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో వై వెంకయ్య తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉన్నందున అభిషేకాలను రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ప్రాంగణంలో చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

చినుకుపడితే చిత్తడే


అధ్వానంగా ఉన్న ముటుకూరు రహదారి

దుర్గి, జూలై 16: దుర్గిలోని ముటుకూరు రోడ్డు కొద్దిపాటి వర్షం పడినా చిత్తడిగా మారుతోంది. అధికారులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా తూతూమంత్రపు పనులతో మమా అనిపిస్తున్నారు. ఈ రహదారి మురుగు కాలువను తలపిస్తూ దుర్వాసన వస్తోంది. ప్రధాన రహదారి కావడం, నిత్యం అధికారులు ఇటుగా వెళ్తున్నా పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ప్రజలు వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలు కిందపడి ప్రమాదాలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

డెంగీ నివారణా మాసోత్సవాల ర్యాలీ


వర్షాకాలంలో వచ్చే వ్యాధులను గురించి వివరిస్తున్న మలేరియా పర్యవేక్షకుడు అంకమ్మరావు


రెంటచింతల, జూలై 16 : రెంటచింతలలో డెంగీ నివారణా మాసోత్సవాల్లో బాగంగా జిల్లా మలేరియా అధికారి కె.రవి రత్నాకర్ ఆదేశాల మేరకు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా పర్యవేక్షకుడు అంకమ్మరావు మాట్లాడుతూ అందరూ దోమతెరలు వాడాలని, ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని దోమకాటు వల్ల వచ్చే బోదకాలు, మెదడువాపు, చికెన్‌గున్యా, మలేరియా, డెంగీ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్‌కుమార్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ మహేష్‌బాబు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● మరో ముగ్గురికి గాయాలు

మేడికొండూరు జూలై 16: ఎదురెదురుగా వస్తున్న కారు, మోటార్ సైకిల్ డీకొన్న ప్రమాదంలో మోటార్ సైకిల్ నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఇద్దరు బాలికలున్నారు. ఈ సంఘటన మేడికొండూరు మండలం జేకేపత్రు పరిధిలో పేరేచర్ల-నరసరావుపేట రోడ్డులో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం అమరావతి మండలం పొందుగల గ్రామానికి చెందిన ఆరేకట్ల శివనాగేశ్వరరావు (25) అనే యువకుడు ఉద్యోగం కోసం మార్కాపురంలో జరిగే ఇంటర్వ్యూకి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. గుంటూరు నగరానికి చెందిన కుటుంబసభ్యులు ఫిరంగిపురంలో జరిగిన మేరిమాత మహోత్సవానికి హాజరై తిరిగి గుంటూరు వెళుతుండగా కారు మోటార్ సైకిల్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో మోటార్ సైకిల్ నడుపుతున్న శివనాగేశ్వరరావు సుమారు ముప్పై అడుగుల ఎత్తున ఎగిరిపడ్డాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కారు ముందుబాగం కూడా ధ్వంసం కావడంతో పాటు ఎయిర్ బ్యాగులు ఓపెన్ అయ్యాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో ముగ్గురికి మాత్రమే గాయాలు అయ్యాయి. కేసును మేడికొండూరు ఎస్ఐ చల్లా వాసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విజయసాయిరెడ్డి వ్యాఖ్యలకు జర్నలిస్టుల నిరసన



నిరసన ర్యాలీ చేస్తున్న జర్నలిస్టులు

సత్తెనపల్లి, జూలై 16: ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం సత్తెనపల్లిలో విలేకరులు నిరసన ప్రదర్శన చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. విజయసాయిరెడ్డిపై వచ్చిన ఆరోపణలపై డీఎన్ఏ పరీక్ష చేయించుకొని ప్రజాస్వామ్యబద్ధంగా న్యాయ పోరాటం చేయాలని జైభీమ్ భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయకుమార్ అన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా విజయసాయిరెడ్డి ఎదురు దాడి చేయటం తగదన్నారు. జర్నలిస్టులకు తన మద్దతు ప్రకటించారు. తెలుగుమహిళలు కందిమళ్ళ రజిని, తోట అంబిక తదితరులు కూడా జర్నలిస్టులకు తమ మద్దతు ప్రకటించారు. విజయసాయిరెడ్డి చిత్రపటానికి చెప్పుల దండ వేసి నిరసన తెలియజేశారు. జర్నలిస్టులను అవమాన పరిచిన విజయసాయిరెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జర్నలిస్టులు తహసీల్దార్‌కు అందించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేటను క్లీన్ అండ్ గ్రీన్‌గా మారుస్తా

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 16: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్నారని, నరసరావుపేటను క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చే బాధ్యత నేను తీసుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం నరసరావుపేట పట్టణం మున్సిపల్ అతిథి గృహంలో కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా రేపటి నుంచి శానిటేషన్ వారోత్సవాలు జరపాలని అధికారులకు సూచించారు. నరసరావుపేటలోని 33వార్డులను మూడు యూనిట్లుగా తీసుకొని ఒక్కొక్క యూనిట్‌లోని సిబ్బంది అంతా ఒకరోజు ఒకే చోట పనిచేసి నరరావుపేటను మూడు రోజులలో క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఇద్దరు సిబ్బంది ఆ వార్డులోని శానిటేషన్ వ్యవస్థపై పర్యవేక్షించాలన్నారు. నరసరావుపేటలో అంటువ్యాధులు రాకుండా మున్సిపల్ అధికారులతో పాటు ప్రతి ఒక్కరు బాధ్యత అనుకొని శానిటేషన్ వారోత్సవాలలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, వేల్పుల సింహాద్రి యాదవ్, కొట్టా కిరణ్‌కుమార్, కొప్పూరు బాబు, సంజీవరావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యల ఏర్పాటు

● జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు

నరసరావుపేట రూరల్, జూలై 16: మత్స్య సహకార సంఘాలను 'రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యలుగా' ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్. సంజీవరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో జిల్లా పరిధిలోని ఆరు మత్స్య సహకార సంఘాలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.సంజీవరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా జాతీయ సహకార అభివృద్ధి సంస్థ సహకారంతో చేపల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యలు (ఎఫ్.ఎఫ్.పి.ఓ)గా రూపాంతరంచేసి వ్యాపార కార్యకలాపాలను బలోపేతం చేస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్. సంజీవరావు తెలిపారు. జిల్లా కోపరేటివ్ అధికారి శ్రీనివాసరావు మేనేజ్‌మెంట్ కాస్ట్, ఈక్విటీ గ్రాంట్లను పొందేందుకు సమర్పించాల్సిన సంఘ తీర్మానాలు, సంఘాలు నిర్వహించే వ్యాపారానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు జి. భాగ్యలత, మత్స్య సహాయకులు, మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణ కార్యక్రమం

నరసరావుపేట లీగల్, జూలై 16: పల్నాడు జిల్లాలో కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జరుగుతుందని పల్నాడు జిల్లా డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రవి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఆషా కార్యకర్త, మగ స్వచ్ఛంద కార్యకర్త ఒక టీమ్‌గా ఏర్పడి సర్వే చేస్తారన్నారు. ఈ టీమ్ ఇళ్ళ వద్దకు వచ్చినప్పుడు ప్రజలు వారికి రాగి రంగు కాని, పాలిపోయిన, మొద్దుబారిన మచ్చలు గాని, కాళ్ళు, చేతులు వంకర్లుపోయి వస్తువులను పట్టుకోలేకపోయిన, చేతులు, శరీరం మీద బొబ్బలు ఉన్న, మొఖంపై నూనె రాసినట్టు ఉన్నా, కళ్ళు మూతపడక పోయినా సంబంధిత బృందాలకు తెలియజేయాలన్నారు. కుష్టు వ్యాధి ప్రమాదకరం కాదని, చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ కే మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డాక్టర్ కోడెల శివరామకృష్ణ

నరసరావుపేట టౌన్, జూలై 16: కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పీ అరుణబాబును టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ మంగళవారం కలిశారు. శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆటోనగర్‌ను పూర్తిచేసి ప్రత్యేక గుర్తింపు తెస్తాం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

● ఏపీఐఐసీ అధికారులతో కలసి ఆటోనగర్ పరిశీలన

చిలకలూరిపేట అర్బన్, జూలై 16: చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక అయిన ఆటోనగర్‌ను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేసి చిలకలూరిపేటకు ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తామని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. సకల సౌకర్యాలతో త్వరలోనే లబ్ధిదారులకు ఇక్కడ కేటాయించిన ప్లాట్లను కూడా అందిస్తామని హామీఇచ్చారు. చిలకలూరిపేట మండలం పోతవరం వద్ద ఆటోనగర్ ప్రాంతాన్ని మంగళవారం ఏపీఐఐసీ అధికారులతో కలసి పరిశీలించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం 2016లోనే ఈ ఆటోనగర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు చేపట్టామని, ఆటో మొబైల్ యూనిట్ల ఏర్పాటుకు ఏపీఐఐసీ 42.30 ఎకరాల భూమి కూడా కేటాయించిందని, నాడు రూ.50కోట్లతో తొలి దశలో రహదారులు, విద్యుత్ స్తంభాలు, అంతర్గత మురుగు కాలువలు పూర్తిచేసినా 2019లో ప్రభుత్వం మారటంతో ఆ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆటోనగర్ పనులు తిరిగి పట్టాలు ఎక్కించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఏపీఐఐసీ అధికారులు జీవన్, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన దొరబాబులతో చర్చించారు. ఆటోనగర్‌కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఫేజ్-1, ఫేజ్-2లను కలిపి మధ్యలో ఉన్న భూముల రైతులు ముందుకువస్తే వాటిని కూడా అభివృద్ధి చేయాలని, గత పాలకుల్లా ఎవరిపై ఒత్తిడి మాత్రం చేయమని ఈ సందర్భంగా ప్రత్తిపాటి తెలిపారు. నాడు తొలి దశ పనులతో పాటు లబ్ధిదారులను కూడా ఎంపిక చేశామన్నారు. కాని ఆ తరువాత వైసీపీకి చెందిన కొంతమంది ఈ ఆటోనగరేకే కాదు, ఇంకొక ఆటోనగర్‌కు కూడా స్థలం ఇస్తామని మాయ మాటలు చెప్పి అవన్నీ మరచిపోయి ప్రజలను మోసం చేశారని ప్రత్తిపాటి మండిపడ్డారు. ప్రభుత్వం మారటంతో ఇంతకాలానికి ఆ గ్రహణం వీడింది. టాటా మహేంద్ర కంపెనీల తరహా జీపులు తయారుచేసే శక్తి సామర్థ్యాలు ఉన్న కార్మికులు ఇక్కడ ఉన్నారని, అంతటి ప్రాముఖ్యం కలిగిన ఆటో నగర్‌ను ఎందుకు నిర్లక్ష్యం చేశారో వారికే తెలియాలన్నారు. ఇక్కడి కార్మికుల్లో ఎక్కువమంది పేదలు, ముస్లిం మైనార్టీలు ఉన్నారని, వారందరికీ అనువుగా ఉంటే తప్ప ఇక్కడికి రారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా సమస్యను తీసుకువెళ్ళి ఎంత మేర వారికి రాయితీలు ఇప్పించాలో అంత ఇప్పిస్తామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. మొత్తం మీద ఆటోనగర్ ఏర్పాటుతో చిలకలూరిపేటను ప్రత్యేక స్థానంలో నిలబెట్టడమే తమ లక్ష్యమని ప్రత్తిపాటి పేర్కొన్నారు. చిలకలూరిపేట తాగునీటి చెరువును పరిశీలించిన తరువాత ఇదే విషయమై జనలవనరుల శాఖ మంత్రి రామానాయుడు, కార్యదర్శి సాయి ప్రసాదుతో మాట్లాడినట్లు తెలిపారు. బుధవారం సాగర్ కుడికాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్నామని, సోమ లేదా మంగళవారానికి చిలకలూరిపేట చెరువుకు జలాలు చేరే అవకాశం ఉందని ప్రత్తిపాటి తెలిపారు. 15రోజుల తరువాత చిలకలూరిపేటలో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు.


ఆటోనగర్ ప్రాంగణంలో పెరిగిన పిచ్చి చెట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

గుంటూరు ఐజీని కలిసిన ప్రత్తిపాటి

గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని గుంటూరులోని డీఐజీ కార్యాలయంలో మాజీ మంత్రి, చిలకలూరిపేట శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

కొండపై ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జీవీ

● కొండపైకి వచ్చే భక్తుల కోసం 30 ఆర్టీసీ బస్సులు

● 270 మంది పోలీసులతో భారీ భద్రత

వినుకొండ టౌన్, జూలై 16: తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని కొండకు వచ్చే భక్తులకు అధికారులు చేస్తున్న ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి పరిశీలించారు. కొండపైకి సుమారు 50వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ డిపో నుంచి 30 బస్సులు ఏర్పాటు చేశామని, రూ.40 టికెట్ ధర నిర్ణయించినట్లు ఆర్టీసీ డీఎం కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాలమేరకు మొత్తం 270 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని, ఇందులో 5 సీఐలు, 28 మంది ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ కలిపి కొండపై, పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ ఎస్.సాంబశివరావు తెలిపారు. అనంతరం ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఏర్పాట్లను పరిశీలించారు. కొండపైకి వచ్చే భక్తులకు హిమాలయ గురుజీ, ఆర్ఎస్ఎస్ సాకారంతో కొండపై ఉచిత అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామని శాంతి ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు తెలిపారు, బాలాలయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాల దర్శనానికి ఏర్పాటుచేశామన్నారు. కొండపై భక్తులకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు దేవదాయశాఖ ఈవో హనుమంతరావు తెలిపారు. కొండపై భక్తులకు రెండు మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేశామని డీఎంహెచ్‌వో డాక్టర్ రవికుమార్ సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచామని, టాయిలెట్లు ఏర్పాటు చేశామని కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ చిన్న కొండపై శివశక్తి ఫౌండేషన్ ద్వారా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారని, కలిసి కట్టుగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.


కొండపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

తిరునాళ్లకు నాలుగు భారీ విద్యుత్ ప్రభలు

వినుకొండ టౌన్, జూలై 16: తొలి ఏకాదశి తిరుణాల పండుగను పురస్కరించుకుని స్థానిక జూనియర్ కాలేజి గౌండ్‌లో జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను ఆధ్వర్యంలో భారీ విద్యుత్ ప్రభతో పాటు, పట్టణంలో రెండు టీడీపీ, మరో ఒక స్వతంత్ర్య ప్రభ, ఒక ఆర్కెస్ట్రాను భక్తులు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ సాంబశివరావు మంగళవారం తెలిపారు. ఎవరైనా ప్రభల వద్ద అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

ఘనంగా మొహరం 10వ రోజు వేడుకలు

కొండవీడు (యడ్లపాడు), జూలై 16: మండలంలో మొహరం వేడుకల సందర్భంగా తొమ్మిదవ రోజైన మంగళవారం రాత్రి కొండవీడు పీర్ల చావిడిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమీప గ్రామాల ప్రజలు పీర్ల చావిడిని సందర్శించి కొబ్బరికాయలుకొట్టి మొక్కులను తీర్చుకున్నారు. పీర్లకు బాసికాలను సమర్పించి హజరత్ అలి పంచావద్ద ఆశీర్వచనాలను అందుకున్నారు. ముజావర్లు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలను కల్పించారు. బుధవారం పదో రోజున పెద సరగత్ వైభవంగా నిర్వహించేందుకు ఈ సందర్భంగా చావిడి నుంచి పలు వీధులలో రంగురంగుల విద్యుత్ బల్బులతో అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మొహరం వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

కొండవీడులో జరిగిన మొహరం వేడుకల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పీర్లచావిడిలోకి వెళ్ళి గ్రామస్థులతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, పల్నాడు జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు ఎం.వీరారెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు శిలార్, తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, జూలై 16: మండలంలోని గ్రామాల్లో మొహరం పర్వదినం రాక సందర్భంగా పీర్ల ఊరేగింపు కార్యక్రమం మంగళవారం తెల్లవారు జామున ఘనంగా జరిగింది. తొమ్మిదవ షరగత్ సందర్భంగా పీర్లను మేళతాళాల మధ్య ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకు వెళ్ళారు. రొంపిచర్లలోని పీర్ల చావిడిలను అందంగా అలంకరించారు. మండలంలోని విప్పర్ల, కొత్తపల్లి, ఎడ్వర్డుపేట, అలవాల, మునమాక, సంతగుడిపాడు గ్రామాల్లో పీర్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది.

పెరుమాలపల్లి మేజరు కాలువలో చెత్త తొలగింపు

వినుకొండ, జూలై 16: మున్సిపల్ అధికారులు చేపట్టిన స్వచ్ఛత- పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా కారంపూడి రోడ్డులోని పెరుమాలపల్లి మేజరు కాలవలో చెత్తను తొలగించే కార్యక్రమం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన, జనసేన నాయకులు నిశంకర శ్రీనివాసరావు, నాగ శ్రీనుతో కలిసి సుమారు గంటకుపైగా కావలలోని చెత్తను తొలగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత అయిదు సంవత్సరాల కాలంలో మేజరు కాలవలో చెత్తతో పూడిపోయిందని, త్వరలో నాగార్జునసాగర్ డ్యామ్ నుంచి కాలవలకు అధికారులు తాగునీరు విడుదల చేస్తున్నారని, కాలవలో పేరుకుపోయిన మలిన పదార్థాలతో, ప్రజలకు అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందని, మున్సిపల్ అధికారుల సాయంతో పట్టణంలోని కాలవలను శుభ్రం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు కాలవలో చెత్తా, చెదారం వేయవద్దని కోరారు. అనంతరం 32వ వార్డులో కౌన్సిలర్ లింగమూర్తి చొరవతో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజి కాలవకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, డీఈఈ, వెంకయ్య పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, పీవీ సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం 11వ వార్డులో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల అఖండ విజయం సాధించిన సందర్భంగా పార్టీ నాయకులు మునెయ్య ఆధ్వర్యంలో మదమంచిపాటి వీరాంజినేయ స్వామి ఆలయం వరకు చేపట్టిన పాదయాత్రను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. కార్యకర్తలతో కలిసి పాదయాత్రలో పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు.


కాలవలో చెత్తను తొలగిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, అధికారులు, నాయకులు

జీపీఎస్ ఆర్డినెన్స్ నిలిపివేతపై హర్షం

చిలకలూరిపేట, జూలై 16: రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ ఆర్డినెన్స్‌ను నిలిపివేయటంపై ఎస్టీయూ నేతలు మంగళవారం హర్షం ప్రకటించారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగుల సమ్యలను పరిష్కరించే దశలో ముందడుగు వేయాలని కోరారు. పీఆర్‌సీ కమిటీకి కొత్త చైర్మన్‌ను నియమించాలని కోరారు. పీఆర్‌సీ, డీఏ బకాయిలు తక్షణం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశమైన నాయకుల్లో పోట్రు శ్రీనివాసరావు, వినుకొండ అక్కయ్య, జమీర్ బాషా, మేకల కోటేశ్వరరావు, ఏ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్స్ డే

నరసరావుపేట టౌన్, జూలై 16: ప్రతి విద్యార్థి, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నిరంతరం కష్టపడితే మంచి స్థాయికి వెళ్తారని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు అన్నారు. మంగళవారం ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్స్‌డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సాధినేని రామారావు మాట్లాడుతూ ఈ సంవత్సరం శాంతి, అభివృద్ధి అంశాలు ఆధారంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జె.రవిశంకర్ మాట్లాడుతూ చదువుతో పాటు సామాజిక స్పృహ, నైతిక విలువలు ఉంటేనే సమాజంలో విలువ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కందిపప్పు, బియ్యం విక్రయాలకు 14 ప్రత్యేక కౌంటర్లు

నరసరావుపేట రూరల్, జూలై 16: ప్రస్తుత బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ అధికంగా పెరిగిపోతున్న నేపథ్యంలో తక్కువ ధరలకు ప్రధాన నిత్యావసరాలైన నాణ్యమైన బియ్యం, కందిపప్పులను విక్రయించేందుకు పల్నాడు జిల్లాలో 14 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం ఫైన్‌రకం (స్టీము రైస్) రూ.55,85/- ఉండగా రూ.49/-లకు, ఫైన్‌రకం (ముడి లేదా రారైస్) ప్రస్తుతం రూ.52.40/- పై.లు ఉండగా రూ.48/-లకు, దేశవాళి కందిపప్పు ప్రస్తుతం రూ.174/-లు ఉండగా రూ.160/- లకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజలకు అందుబాటు ఉంచామన్నారు. సరుకులు మనిషికి ఒకొక్కరికి బియ్యం-5 కేజీలు, కందిపప్పు-1 కేజీ చొప్పున విక్రయించనున్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

చిలకలూరిపేట, జూలై 16: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గురువారం పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు సీఆర్‌డీపీ ఎస్ఈ డాక్టర్ పీ విజయకుమార్ తెలిపారు. చిలకలూరిపేట పట్టణానికి సమీపంలో ఉన్న 52 ఎకరాల్లోని టిడ్కో డివిజన్ ఆఫీసులో వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం వేదిక ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్ పాల్గొంటారని వివరించారు. విద్యుత్ పరమైన సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. చిలకలూరిపేట సబ్ డివిజన్ పరిధిలో ఉన్న గ్రామాల వారు గణపవరం, యడ్లపాడు, చిలకలూరిపేట పట్టణ పరిధిలో ఉన్న వినియోగదారులు, గుంటూరు రూరల్-1 పరిధిలో ఉన్న డోకిపర్రు, ఫిరంగిపురం, వట్టిచెరుకూరు పరిసర ప్రాంతాల వినియోగదారులు ఈ వేదికను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

● తహసీల్దార్‌కు ఏపీ రైతుసంఘం నాయకుల వినతి

యడ్లపాడు, జూలై 16: హైటెన్షన్ విద్యుత్ లైన్ల నిర్మాణంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం నాయకులు, రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ ఆఫ్రష్నీసాబేగంను కలసి వినతిపత్రం అందజేశారు. రాజధాని అమరావతి కోసం ట్రాన్స్‌కో 2018లో సత్తెనపల్లి నుంచి యడ్లపాడు మండలంలోని ఏడు గ్రామాల నుంచి ప్రత్తిపాడు మండలంలోని చిన కోండ్రుపాడు వరకు 220కేవీ హైటెన్షన్ విద్యుత్‌లైన్‌ను ఏర్పాటుచేశారు. రైతులు భూముల్లో ఏర్పాటుచేసిన టవర్లకు అప్పట్లోనే రైతులకు పరిహారం ప్రభుత్వం అందజేసింది. అయితే విద్యుత్ తీగెల కింద భూములకు కూడా భూమి విలువలో 10శాతం నష్టపరిహారం అందజేయాలని లింగారావుపాలెం గ్రామానికి చెందిన రైతులు న్యాయపోరాటం చేయగా వారికి మాత్రమే 2022లో పరిహారం అందించారు. దీంతో యడ్లపాడు, మైదవోలు, తిమ్మాపురం, కారుచోల, జగ్గాపురం, ఉన్నవ గ్రామాలకు చెందిన 225మంది రైతులు పరిహారం కోసం విజ్ఞప్తి చేసుకున్నా ఫలితం లేకుండాపోయింది. రీసర్వే, కొవిడ్ అంటూ కారణాలు చూపి పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేశారని, బాధిత రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం మండల కార్యదర్శి కె.రామారావు, జె.శంకరం, రైతులు ముత్తవరపు సీతారామయ్య, వెంకట్రావు, పి.సోమయ్య, వీరాంజనేయులు, జి.శ్రీధర్, శ్రీనివాసరావు, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, గాండ్ల అనిల్, సుబ్బారావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఏటీపీ ఐటీఐ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట రూరల్, జూలై 16: మండలంలోని రావిపాడులోని ఏటీపీ ఐటీఐ కళాశాలలో మంగళవారం తమిళనాడు రాష్ట్రం చెన్నైకు చెందిన థర్మల్ కంపెనీ, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన తోషిబా కంపెనీ ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఎంపికలలో థర్మల్ కంపెనికి 35మంది, తోషిబా కంపెనీకి 15మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో మొత్తం 50మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు హెచ్‌ఆర్ ఎ.శివాచారి తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ ఫాదర్ ఎం.సుందర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు, తల్లులకు అవగాహన కార్యక్రమం

నాదెండ్ల, జూలై 16: మండలంలోని సాతులూరులో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా బాలికలకు, తల్లులకు మంగళవారం అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సహాయ సీడీపీవో నిర్మలరాణి మాట్లాడుతూ తల్లులు బాలికల అక్రమ రవాణాపై అప్రమత్తం ఉండాలన్నారు. మోసపూరిత మా టలను నమ్మకూడదని సూచించారు. బాల్య వివాహాలు, బాలికల భవిష్యత్‌ను అంధకారంలోకి నెడతాయన్నారు. కార్యక్రమంలో సూప ర్‌వైజర్ కే పద్మ, కార్యకర్తలు రమాదేవి, కల్పన, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ నరసరావుపేట చిట్‌రిజిస్ట్రార్‌గారి కోర్టు నందు
Dispute No : 295/2022
వెంకట తిరుమల చిట్ ఫండ్(ప్రై)లిమిటెడ్
నరసరావుపేట Disputant
Vs
రాచమల్లు శ్రీరామమూర్తి మరియు ఇతరులు
opponents
Notice as per rule 50 of the A.P. Chit Fund Rules 2008

OPPONENT 1 : రాచమల్లు శ్రీరామమూర్తి S/o. ఆర్. హనుమంతరావు, వయస్సు 75, బిజినెస్, ప్రొప్రయిటర్ : శ్రీనివాసా మెడికల్ ఎంటర్‌ప్రైజెస్, డి.నెం. 22-19, మెయిన్‌రోడ్, పాటిశ్రీరాములు వీధి, చిలకలూరిపేట (పో) & (మం), పల్నాడు జిల్లా.

పైన తెలియచేసిన Disputeకి సంబంధించి, వెంకట తిరుమల చిట్‌ఫండ్ కంపెనీవారు మీపై చిట్‌రిజిస్ట్రారు గారి కోర్టులో పైనంబరుపైన Dispute దాఖలు చేసి ఉన్నారు. అందుకు సంబంధించి ఎన్ని పర్యాయములు మీకు నోటీసులు జారీ చేసినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందువలన పైనంబరు Disputeలో మీకు నోటీసులు జారీ కాగలందులకు గాను, ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరచవలసిందిగా ఆర్డరు వేసినారు. కావున మీరు ది.27-07-2024వ తేదీన ఉదయం గం॥ 10-30 ని॥లకు నర్సరావుపేట చిట్‌రిజిస్ట్రార్ గారి కోర్టులో హాజరు అయ్యి, మీకు గల అక్షేపణలను స్వయంగా గాని, లేక న్యాయవాది ద్వారా గాని తెలియచేసుకొనగలరు. లేని యెడల మీపై పరోక్షంగా పై Dispute 295/2022 నందు తీర్మానం చేయబడునని ఈపేపరు ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.

వాయిదా తేది : 27-07-2024
నర్సరావుపేట, పల్నాడు జిల్లా.
ఇట్లు : మేనేజరు / ఫోర్‌మెన్
వెంకట తిరుమల చిట్‌ఫండ్(ప్రై)లిమిటెడ్,
నర్సరావుపేట.

ప్రకటన

మహారాజశ్రీ నరసరావుపేట చిట్‌రిజిస్ట్రార్‌గారి కోర్టు నందు
Dispute No : 298/2022
వెంకట తిరుమల చిట్ ఫండ్(ప్రై)లిమిటెడ్
నరసరావుపేట Disputant
Vs
గుగ్గిలం విఘ్నేశ్వరరావు మరియు ఇతరులు
opponents
Notice as per rule 50 of the A.P. Chit Fund Rules 2008

OPPONENT 1 : గుగ్గిలం విఘ్నేశ్వరరావు S/o. జి. ఉపేంద్రరావు, వయస్సు 56, ప్రొప్రయిటర్ : M/s శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీస్, డి.నెం. 3-6-32/19/4&5, పాతూరు, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
OPPONENT 2: గుగ్గిలం మల్లేశ్వరి W/o. జి. విఘ్నేశ్వరరావు, వయస్సు 51, డి.నెం. 3-6-32/19/4&5, పాతూరు, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
OPPONENT 3 : కళ్ళం వరప్రసాద్ S/o. కె. రెడ్డి, వయస్సు : 43, ప్రొప్రయిటర్ : వెంకటేశ్వర ఏజెన్సీస్, డి.నెం. 2-4-80/2, రాజాగారి తోట, ఏనుగుల బజారు, నరసరావుపేట (పో) & (మం), పల్నాడు జిల్లా.

పైన తెలియచేసిన Disputeకి సంబంధించి, వెంకట తిరుమల చిట్‌ఫండ్ కంపెనీవారు మీపై చిట్‌రిజిస్ట్రారు గారి కోర్టులో పైనంబరుపైన Dispute దాఖలు చేసి ఉన్నారు. అందుకు సంబంధించి ఎన్ని పర్యాయములు మీకు నోటీసులు జారీ చేసినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందువల్ల పైనంబరు Disputeలో మీకు నోటీసులు జారీ కాగలందులకు గాను, ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరచవలసిందిగా ఆర్డరు వేసినారు. కావున మీరు ది.27-07-2024వ తేదీన ఉదయం గం॥ 10-30ని॥లకు నర్సరావుపేట చిట్‌రిజిస్ట్రార్ గారి కోర్టులో హాజరు అయ్యి, మీకు గల అక్షేపణలను స్వయంగా గాని, లేక న్యాయవాది ద్వారా గాని తెలియచేసుకొనగలరు. లేని యెడల మీపై పరోక్షంగా పై Dispute 298/2022 నందు తీర్మానం చేయబడునని ఈపేపరు ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.

వాయిదా తేది : 27-07-2024
నర్సరావుపేట, పల్నాడు జిల్లా.
ఇట్లు : మేనేజరు / ఫోర్‌మెన్
వెంకట తిరుమల చిట్‌ఫండ్(ప్రై)లిమిటెడ్
నర్సరావుపేట.

ప్రకటన

మహారాజశ్రీ నరసరావుపేట చిట్‌రిజిస్ట్రార్‌గారి కోర్టు నందు
Dispute No : 296/2022
వెంకట తిరుమల చిట్ ఫండ్(ప్రై)లిమిటెడ్
నరసరావుపేట Disputant
Vs
గుగ్గిలం విఘ్నేశ్వరరావు మరియు ఇతరులు
opponents
Notice as per rule 50 of the A.P. Chit Fund Rules 2008

OPPONENT 1 : గుగ్గిలం విఘ్నేశ్వరరావు S/o. జి. ఉపేంద్రరావు, వయస్సు 56, ప్రొప్రయిటర్ : M/s శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీస్, డి.నెం. 3-6-32/19/4&5, పాతూరు, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
OPPONENT 2: గుగ్గిలం మల్లేశ్వరి W/o. జి. విఘ్నేశ్వరరావు, వయస్సు 51, డి.నెం. 3-6-32/19/4&5, పాతూరు, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
OPPONENT 4 : కళ్ళం వరప్రసాద్ S/o. కె. రెడ్డి, వయస్సు : 43, ప్రొప్రయిటర్ : వెంకటేశ్వర ఏజెన్సీస్, డి.నెం. 2-4-80/2, రాజాగారి తోట, ఏనుగుల బజారు, నరసరావుపేట (పో) & (మం), పల్నాడు జిల్లా.
OPPONENT 5 : గుగ్గిలం సందీప్ S/o. జి. విఘ్నేశ్వరరావు, వయస్సు 30, డి.నెం. 3-6-32/19/4&5, పాతూరు, నరసరావుపేట, పల్నాడు జిల్లా.

పైన తెలియచేసిన Disputeకి సంబంధించి, వెంకట తిరుమల చిట్‌ఫండ్ కంపెనీవారు మీపై చిట్‌రిజిస్ట్రారు గారి కోర్టులో పైనంబరుపైన Dispute దాఖలు చేసి ఉన్నారు. అందుకు సంబంధించి ఎన్ని పర్యాయములు మీకు నోటీసులు జారీ చేసినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందువలన పైనంబరు Disputeలో మీకు నోటీసులు జారీ కాగలందులకు గాను, ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరచవలసిందిగా ఆర్డరు వేసినారు. కావున మీరు ది.27-07-2024వ తేదీన ఉదయం గం॥ 10-30 ని॥లకు నర్సరావుపేట చిట్‌రిజిస్ట్రార్ గారి కోర్టులో హాజరు అయ్యి, మీకు గల అక్షేపణలను స్వయంగా గాని, లేక న్యాయవాది ద్వారా గాని తెలియచేసుకొనగలరు. లేని యెడల మీపై పరోక్షంగా పై Dispute 296/2022 నందు తీర్మానం చేయబడునని ఈపేపరు ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.

వాయిదా తేది : 27-07-2024
నర్సరావుపేట, పల్నాడు జిల్లా.
ఇట్లు : మేనేజరు / ఫోర్‌మెన్
వెంకట తిరుమల చిట్‌ఫండ్(ప్రై)లిమిటెడ్,
నర్సరావుపేట.

ప్రకటన

మహారాజశ్రీ నరసరావుపేట చిట్‌రిజిస్ట్రార్‌గారి కోర్టు నందు
Dispute No : 293/2022
వెంకట తిరుమల చిట్ ఫండ్(ప్రై)లిమిటెడ్
నరసరావుపేట Disputant
Vs
గుగ్గిలం విఘ్నేశ్వరరావు మరియు ఇతరులు
opponents
Notice as per rule 50 of the A.P. Chit Fund Rules 2008

OPPONENT 1 : గుగ్గిలం విఘ్నేశ్వరరావు S/o. జి. ఉపేంద్రరావు, వయస్సు 56, ప్రొప్రయిటర్ : M/s శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీస్, డి.నెం. 3-6-32/19/4&5, పాతూరు, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
OPPONENT 2: గుగ్గిలం మల్లేశ్వరి W/o. జి. విఘ్నేశ్వరరావు, వయస్సు 51, డి.నెం. 3-6-32/19/4&5, పాతూరు, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
OPPONENT 6 : గుగ్గిలం సందీప్ S/o. జి. విఘ్నేశ్వరరావు, వయస్సు 30, డి.నెం. 3-6-32/19/4&5, పాతూరు, నరసరావుపేట, పల్నాడు జిల్లా.

పైన తెలియచేసిన Disputeకి సంబంధించి, వెంకట తిరుమల చిట్‌ఫండ్ కంపెనీవారు మీపై చిట్‌రిజిస్ట్రారు గారి కోర్టులో పైనంబరుపైన Dispute దాఖలు చేసి ఉన్నారు. అందుకు సంబంధించి ఎన్ని పర్యాయములు మీకు నోటీసులు జారీ చేసినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందువలన పైనంబరు Disputeలో మీకు నోటీసులు జారీ కాగలందులకు గాను, ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరచవలసిందిగా ఆర్డరు వేసినారు. కావున మీరు ది.27-07-2024వ తేదీన ఉదయం గం॥ 10-30 ని॥లకు నర్సరావుపేట చిట్‌రిజిస్ట్రార్ గారి కోర్టులో హాజరు అయ్యి, మీకు గల అక్షేపణలను స్వయంగా గాని, లేక న్యాయవాది ద్వారా గాని తెలియచేసుకొనగలరు. లేని యెడల మీపై పరోక్షంగా పై Dispute 293/2022 నందు తీర్మానం చేయబడునని ఈపేపరు ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.

వాయిదా తేది : 27-07-2024
నర్సరావుపేట, పల్నాడు జిల్లా.
ఇట్లు : మేనేజరు / ఫోర్‌మెన్
వెంకట తిరుమల చిట్‌ఫండ్(ప్రై)లిమిటెడ్,
నర్సరావుపేట.

ప్రకటన

మహారాజశ్రీ నరసరావుపేట చిట్‌రిజిస్ట్రార్‌గారి కోర్టు నందు
Dispute No : 297/2022
వెంకట తిరుమల చిట్ ఫండ్(ప్రై)లిమిటెడ్
నరసరావుపేట Disputant
Vs
గుగ్గిలం విఘ్నేశ్వరరావు మరియు ఇతరులు
opponents
Notice as per rule 50 of the A.P. Chit Fund Rules 2008

OPPONENT 1 : గుగ్గిలం విఘ్నేశ్వరరావు S/o. జి. ఉపేంద్రరావు, వయస్సు 56, ప్రొప్రయిటర్ : M/s శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీస్, డి.నెం. 3-6-32/19/4&5, పాతూరు, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
OPPONENT 2: గుగ్గిలం మల్లేశ్వరి W/o. జి. విఘ్నేశ్వరరావు, వయస్సు 51, డి.నెం. 3-6-32/19/4&5, పాతూరు, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
OPPONENT 6 : గుగ్గిలం సందీప్ S/o. జి. విఘ్నేశ్వరరావు, వయస్సు 30, డి.నెం. 3-6-32/19/4&5, పాతూరు, నరసరావుపేట, పల్నాడు జిల్లా.

పైన తెలియచేసిన Disputeకి సంబంధించి, వెంకట తిరుమల చిట్‌ఫండ్ కంపెనీవారు మీపై చిట్‌రిజిస్ట్రారు గారి కోర్టులో పైనంబరుపైన Dispute దాఖలు చేసి ఉన్నారు. అందుకు సంబంధించి ఎన్ని పర్యాయములు మీకు నోటీసులు జారీ చేసినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందువలన పైనంబరు Disputeలో మీకు నోటీసులు జారీ కాగలందులకు గాను, ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరచవలసిందిగా ఆర్డరు వేసినారు. కావున మీరు ది.27-07-2024వ తేదీన ఉదయం గం॥ 10-30 ని॥లకు నర్సరావుపేట చిట్‌రిజిస్ట్రార్ గారి కోర్టులో హాజరు అయ్యి, మీకు గల అక్షేపణలను స్వయంగా గాని, లేక న్యాయవాది ద్వారా గాని తెలియచేసుకొనగలరు. లేని యెడల మీపై పరోక్షంగా పై Dispute 297/2022 నందు తీర్మానం చేయబడునని ఈపేపరు ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.

వాయిదా తేది : 27-07-2024
నర్సరావుపేట, పల్నాడు జిల్లా.
ఇట్లు : మేనేజరు / ఫోర్‌మెన్
వెంకట తిరుమల చిట్‌ఫండ్(ప్రై)లిమిటెడ్,
నర్సరావుపేట.